PRGI No. TEL TEL: 2012/48343

# మహానది

MAHANADI TELUGU DAILY

Website: www.mahanadi.net

రంగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 150 | | ఎడిటర్ : మామిడి సోమయ్య | గురువారం | సెప్టెంబర్ | 10 | 2026 పేజీలు : 8 వెల : రూ.2.00


## సూరత్ టెక్స్‌టైల్ మార్కెట్‌లో.. భారీ అగ్నిప్రమాదం



సూరత్‌లోని (గుజరాత్) సరోలీ ప్రాంతంలో బుధవారం భారీ అగ్నిప్రమా దం సంభవించింది. ఓ భవనంలోని పైఅంతస్తుల్లో ఒక్కసారి మంటలు చెలరేగడం పెను కలకలానికి దారి తీసింది. సమాచారం అందిన వెంట నే అగ్నిమాపక శాఖ స్పందించింది. 15 ఫైర్ ఇంజిన్ల తో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయడం ప్రారంభించారు. ఈ ఘటనలో ఎవరైనా గాయపడ్డారా? లేదా అనే వివరాలు ఇంకా తెలియాల్సింది. ఆస్తినష్టానికి సంబంధించి ప్రాథమిక అంచనాలు కూడా ఇంకా తెలియరాలేదు.




## హసీనాను భారత్ నుంచి పట్టుకొచ్చి ఉరితీస్తాం.. బంగ్లాదేశ్ కఠిన వైఖరి..!

**న్యూఢిల్లీ,సెప్టెంబర్,09:**
బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా విషయం లో మరోసారి ఆదేశంకఠిన వ్యాఖ్యలు చేసింది. 2024 ఆగస్టులో హింసాత్మక విద్యార్థి ఉద్యమం తర్వాత ఆమె బంగ్లాదేశ్ నుంచి భారత్ పారిపో యి వచ్చి, ఇక్కడే నివసిస్తోంది. ఈఏడాది డిసె ంబర్‌లో బం గ్లాదేశ్ తిరిగి వస్తానని చెప్పింది. అయితే, ఈ వి ద్యార్థి ఉద్యమంలో మానవత్వానికి వ్యతిరేకంగా ఆమెఅధికారాన్ని ఉపయోగించిందని అక్కడి కోర్టులు హసీనాను దోషిగా తేల్చాయి. ఆమెకు మరణశిక్షను ఖరారు చేశాయి. ఈ నేప థ్యంలో భారత్ తమకు షేక్ హసీనాను అప్పగిం చాలని బం గ్లాదేశ్ డిమాండ్ చేస్తోంది.

# ఎస్-400, ఎస్‌యు-57, బ్రహ్మోస్‌పై భారత్ ఫోకస్..






## మోదీ-పుతిన్ భేటీలో కీలక చర్చలు..

**న్యూఢిల్లీ,సెప్టెంబర్,09:**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య ఈనెల 11న న్యూఢిల్లీలో ద్వైపాక్షిక భేటీ జరగనుంది. బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో జరగనున్న ఈ సమావేశంలో రక్షణ,వాణిజ్యం,ఇంధనం,అణుశక్తి, సాంకే తిక సహకారంపై చర్చలు జరిగే అవకాశంఉంది. ముఖ్య ంగా రక్షణ రంగంలో ఎస్-400, ఎస్‌యు-57, బ్రహ్మోస్ కోనుగోళ్లపై భారత్ కీలకచర్చలు జరపనున్నట్టు సమాచా రంభారత్-రష్యా రక్షణ సహకారంలో ఎస్-400 వైమా నిక రక్షణ వ్యవస్థ కీలకమైనది. వాటిల్లో మూడింటిని ఇప్పటికే రష్యా నుంచి డెలివరీ తీసుకుంది. మిగిలిన రెండింటినీ ఈఏడాదిచివర్లో అందుకోవాల్సి ఉంది. వా టిగురించి,భవిష్యత్ రక్షణ అవస రాల గురించి కూడా మోదీ-పుతిన్ చర్చించే అవకాశం ఉందిమోదీ-పుతిన్ భేటీలో అత్యంత ఆసక్తికరమైన అంశం రష్యా ఎస్‌యు-57 ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్.
భారత్‌కు ఎస్‌యు-57 విమానాలను విక్రయించే అంశం చర్చలఅజెండాలో ఉందని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పె స్కోవ్ వెల్లడించారు. అయితే భారత్ కేవలం విమానాల ను కొనుగోలు చేయ డంపైనేకాకుండా టెక్నాలజీ ట్రాన్స్ ఫర్‌పైకూడా ఆసక్తి చూపు తోంది. ఎస్‌యు-57 తయా రీకి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని భారత్‌లోకి తీసుకురావడం ద్వారా దేశీయంగా తయారీ సామర్థ్యాన్ని పెంచు కోవాలన్నది ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది ఇక, భారత్-రష్యా సంయుక్త రక్షణ సహకారానికి ప్రతీకగా నిలిచిన బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ మిసైల్‌ను కూడామరింత అభివృద్ధి చేయాలని ఇరుదేశాలు భావిస్తు న్నాయి. బ్రహ్మో స్‌కు అదనపు సామర్థ్యాలు, కొత్త ఫీచర్లు జోడించి దాని పనితీరును పెంచడం గురించి చర్చలు జరుగుతున్నా యని పెస్కోవ్ తెలిపారు.



## 5 ఇరాన్ ట్యాంకర్లపై... అమెరికా దాడి..

**న్యూఢిల్లీ,సెప్టెంబర్,09:**
అమెరికా,ఇరాన్ మధ్య ఘర్షణ మరోసారి తీవ్రరూ పం దాల్చింది. తమ యుద్ధనౌకపై ఇరాన్ రెండుసా ర్లు బాలిస్టిక్ క్షిపణులతో దాడికి యత్నించిందని ఆరోపిస్తూ, అమెరికా బలగాలు ఇరాన్‌కు చెందిన ఐదు భారీ ఆయిల్ ట్యాంకర్లను ధ్వంసం చేశాయి. దీనికి ప్రతీకారంగా ఇరాన్.. జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరంపై క్షిపణులతో దాడి చేసింది. ఈ దాడులు-ప్రతిదాడులతో గల్ఫ్ ప్రాంతం దద్దరిల్లిం ది. యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) కథ నంప్రకారం..మంగళవారం ఒమన్ గల్ఫ్‌లో కావిజ్, చార్మినార్, హొరైజన్ 1,రీస్కో అనే నాలుగు ట్యాంక ర్లతో పాటు, ఇరాన్ ప్రధాన చమురు ఎగుమతి కేంద్రమైన ఖర్గ్‌ద్వీపం సమీపంలో ఉన్న దర్యా అనే మరో ట్యాంకర్‌ను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపారు. దాడికి ముందు ట్యాంకర్లలోని సిబ్బంది నినౌకలను విడిచి వెళ్లాలని ఆదేశించామని, ఆ తర్వాతే వాటిని పనిచేయ కుండా ధ్వంసం చేశామ ని అమెరికా సైన్యం తెలిపింది.

## తెలంగాణలో బీజేపీ గెలుపును ఎవ్వరూ ఆపలేరు: బండి




**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 9:**
తెలంగాణలో బీజేపీ గెలుపును ఎవ్వరూ ఆపలేరని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. బుధవారం భద్రాచలంలో పర్యటిస్తున్న కేంద్ర మంత్రి.. బీజేపీ నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడు తూ.. ఉత్తర్‌ప్రదేశ్ ఎన్నికల తరువాత బీజేపీ అధిష్ఠానం టార్గెట్ తెలంగాణ అని తెలిపారు. కేసీఆర్ పాలనలో ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రి బీజేపీ కార్యకర్త పై అ క్రమకేసులు పెట్టి వేధించారని మండిపడ్డారు. ఉ మ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మంత్రి ఢిల్లీకి మూటలు పంపుతున్నారని ఆరోపించారు.
కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఇచ్చే ఇళ్లు, సన్న బియ్యాన్ని కాంగ్రెస్ గొప్పగా చెప్పుకుంటోందని బండి సంజయ్ విమర్శించారు. కేసీఆర్ మెడలు వంచింది బీజేపీ పార్టీ అని అన్నారు. రజాకార్ల పాలన కంటే ఘోరమైన కేసీఆర్ పాలనలో బీజేపీ కార్యకర్తలు కొట్లాడారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలని పిలుపునిచ్చారు. దేశాన్ని ఏలిన కాంగ్రెస్ నాలుగురాష్ట్రాలకే పరిమితమైందని వెల్లడించారు. తెలం గాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చింద న్నారు. వచ్చేది బీజేపీ ప్రభుత్వమే అని.. కార్యకర్తలు పోలీసు కేసులకు భయపడొద్దని అన్నారు..

# అసెంబ్లీలో బీఆర్ఎస్‌కు షాక్..

## కేటీఆర్, హరీశ్‌రావు సహా సభ్యుల సస్పెన్షన్

**- ఎర్రవల్లి వద్ద 'చావుడప్పు' నిరసనలపై బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన - సభను అడ్డుకుంటున్నారని మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపణ - బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్‌పై తీర్మానం - సభ జరిగే అన్ని రోజులకూ సస్పెన్షన్ వర్తింపు - అనంతరం సభ 10 నిమిషాలు వాయిదా**



**హైదరాబాద్,సెప్టెంబర్,09:**
తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులపై స్పీకర్ సస్పెన్షన్ వేటు వేశారు. కేటీఆర్, హరీశ్‌రావు, తల సానిశ్రీనివాస్ యాదవ్, కోవా లక్ష్మి, సునీతా లక్ష్మా రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ సభ్యుల ను సభ నుంచి సస్పెండ్ చేశారు. ఈ సెషన్‌లో సభ జరిగే అన్ని రోజులకు ఈ సస్పెన్షన్ వర్తించను ంది. సభ ప్రారంభమైన కొద్దిసేపటికే బీఆర్ఎస్ సభ్యులు నిన్నటి ఎర్రవల్లి ఫామ్ హౌస్ వద్ద 'చావుడ ప్పు' నిరసనలపై ఆందోళనకు దిగారు. దీంతో సభ లో గందరగోళం నెలకొంది. బీఆర్ఎస్ సభ్యులు సభాకార్యక్రమా లను అడ్డుకుంటున్నారని మంత్రి శ్రీధర్‌బాబు ఆరో పించారు. దాదాపు గంటసేపటి నుంచి బీఆర్ఎ స్ సభ్యులు సభను అడ్డుకుంటు న్నా రని మంత్రి తెలిపారు. వారిని సస్పెండ్ చేయా లని స్పీకర్‌ను కోరుతూ తీర్మానం ప్రవేశపె ట్టారు. ఈతీర్మానాన్ని సభ ఆమో దించింది. దీంతో బీఆర్ఎస్ సభ్యులను ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. అనంతరం సభను 10 నిమిషాల పాటు వాయిదా వేశారు.


## 'ఒకరి చావు కోరడం సమర్ధనీయం కాదు' కేసీఆర్‌పై వ్యాఖ్యలకు ఎమ్మెల్యే వివరణ



**హైదరాబాద్, సెప్టెంబర్ 9:**
మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరణ ఇచ్చారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఒకరి చావుకోరడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. ము ఖ్యమంత్రిని, దళిత అసెంబ్లీ స్పీకర్‌ను,మహిళా మంత్రు లను అసభ్యకరంగా కులాల పేరుతో దూషిస్తూ వ్యక్తిగత ంగా బూతులు తిడుతున్నారని మండిపడ్డారు. ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతున్నారని..స్పీకర్‌ను అసభ్యపద జాలంతో దూషించారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో కడుపు మండి కేసీఆర్ వెంటనే అసెంబ్లీకి రావాలని, సమస్యలపైచర్చించాలనికోరినట్లు తెలిపారు.తెలంగాణ నాలు గుకోట్ల ప్రజలదని.. కేసీఆర్ కుటుంబ ఒక్కరిదే కాదని ఎమ్మెల్యే అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ప్రాతి నిధ్యం వహిస్తున్న సీఎంపై, వారి కుటుంబ సభ్యులపై బూతులు తిడుతున్నారని ఫైర్ అయ్యారు.

## సభలో లేని వారినీ సస్పెండ్ చేయడం హాస్యాస్పదం: తలసాని

**హైదరాబాద్, సెప్టెంబర్ 9:**
ప్రజల సమస్యలపై చర్చ నుంచి తప్పించు కోవటానికి తమను సస్పెండ్ చేశారని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శలు గుప్పించారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ తమకు భయపడి బలవంతంగా బయటకు పంపారన్నారు. శాసనసభవ్యవహా రాల మంత్రి చదివిన పేర్లు కాకుండా.. స్పీకర్ వేరే పేర్లు చదివారని తెలిపారు. సభలో లేని పద్మారావు, మల్లారెడ్డి, గంగుల, గూడెం మహిపాల్ రెడ్డిని సస్పెండ్ చేయటం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ అంటే అందరకీ గౌరవమని తలసాని అన్నారు.



## 'మాపై దాడి చేసి.. మాపైనే కేసులు పెట్టారు': కేటీఆర్


**న్యూఢిల్లీ,సెప్టెంబర్,09:**
తెలంగాణలో ఎమర్జెన్సీ వాతావరణం నెలకొందని, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యం తీవ్ర ముప్పులో పడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరో పించారు. తెలంగాణ శా సనసభ వేదికగా చెలరేగిన రాజకీయ ఉద్రిక్తతలు రాజ్‌భవన్ (లోక్ భవన్)కు చేరాయి. సభ ముగిసే వరకు సస్పెన్షన్‌కు గురైన బీఆర్ఎస్ శాసనస భ్యులు



చట్టసభలు, పోలీసుల తీరుపై గవర్నర్‌కు అధికారికంగా ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో 10మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం బుధవారం (సెప్టెంబర్ 9) మధ్యాహ్నం లోక్ భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో ప్రత్యేకంగా భేటీ అయ్యింది. ఈ సందర్భంగా అసెంబ్లీ ప్రాం గణంలో చోటుచేసుకు న్న వరుస పరిణామాలను వివరిస్తూ 13 పేజీల సమగ్ర ఫిర్యాదు లేఖను గవర్నర్‌కు అందజేశారు. అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లోక్ భవన్‌లో మాట్లాడారు. "రాష్ట్ర ంలో ఎమర్జెన్సీని తలపించేలా పాలన కొ నసాగుతుంది. రాష్ట్రంలో జరుగుతు న్న పరిణామాలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం. వెయ్యిరోజుల పాలన వైఫల్యాలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం.యూరియా కొరత, రైతు భీమాపై విషయాలను ప్రస్తావించాం. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిమోసం చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యపై గవర్నర్‌కు కంప్లైంట్ ఇచ్చాం.రాహుల్ గాంధీ నల్ల టీషర్ట్స్ వేసుకున్నట్టే.. బీఆ ర్ఎస్ ఎ మ్మెల్యేల ము బ్లాక్ టీషర్ట్స్ వేసుకున్నాం. బ్లాక్ టీ షర్ట్స్‌తో అసెంబ్లీకి వెళ్తుంటే మమ్మ ల్ని పోలీసులు అడ్డుకున్నారు. మాజీ హోంశాఖ మంత్రి సబితా ఇం ద్రారె డ్డిని మగ పోలీసులు గొంతు పట్టుకున్నారు.

# కేసీఆర్ ఫాంహౌస్ వద్ద శుద్ధి.. అసెంబ్లీలో తీవ్ర దుమారం

**- నిన్న కేసీఆర్ ఫాంహౌస్ వద్ద నిరసన తెలిపిన కాంగ్రెస్ ఎస్సీ విభాగం, దళిత సంఘాలు - ఆ ప్రాంతాన్ని బీఆర్ఎస్ నేతలు శుద్ధి చేశారన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ - దళితుల పట్ల వివక్షను బీఆర్ఎస్ మరోసారి నిరూపించుకుందని మండిపాటు**



**హైదరాబాద్,సెప్టెంబర్,09:**
తెలంగాణ శాసనసభ మూడో రోజు సమావే శాలు ప్రారంభం కాగానే సభలో తీవ్ర దుమారం చెలరేగింది. నిన్న సిద్దిపేట జిల్లా ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్ వద్ద కాంగ్రెస్ ఎస్సీ విభాగంనేతలు, దళిత సంఘాలు నిరసన తెలిపిన అనంతరం...బీఆర్ఎస్ నేతలు ఆ ప్రాంతాన్ని శుద్ధి చేశారంటూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సభలోతీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులు నిరసన తెలిపి వెళ్లిన స్థలాన్ని శుద్ధి చేయడం వెనుక బీఆర్ఎస్ నాయకుల తీవ్రమైన కులతత్వం బయటపడిందని... ఇది యావత్ దళిత సమాజ ఆత్మగౌర వాన్ని, హక్కులను తీవ్రంగా అవమానిం చడమేనని విమర్శించారు. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను అసెంబ్లీ గేటు వద్ద బూతులు తిట్టిన అంశాన్ని మరిచిపోకముందే... బీఆర్ఎస్ మరోసారి దళితుల పట్ల తమకున్న వివక్షను నిరూపించుకుం దనిమండిప డ్డారు. ఈ శుద్ధి వ్యవహారంపై సభలో సమగ్ర చర్చ జరగా లని ఆయన పట్టుబట్టారు. మరోవైపు,మంత్రి ప్రసంగానికి అడ్డుతగులు తూ బీఆర్ఎస్ సభ్యులు వెల్‌లోకి దూసు కొచ్చి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై, వారిపై జరిగిన అనుచిత ప్రవర్తనపై ప్రభుత్వం తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్లకార్డులతో నినాదాలు చేశారు.

# తెలంగాణ పొట్టు లారీ యజమానుల సంక్షేమ సంఘానికి నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక

## - లారీ యజమానుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం



హస్తినాపురం,మహానది న్యూస్,సెప్టెంబర్ 09: తెలంగాణ పొట్టు లారీ యజమానుల సంక్షేమ సంఘం నూతన పూర్తిస్థాయి రాష్ట్ర కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత సెప్టెంబర్ 2న హస్తినాపురంలో నిర్వహించిన సమావేశంలో లారీ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించిన అనంతరం రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా తాజాగా పూర్తిస్థాయి రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సిహెచ్. యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా బి.రత్నాకర్‌రావు, కోశాధికారిగా బి. అరవింద్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బండ సుధాకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఉపేందర్‌రెడ్డి, హెచ్. వెంకటేష్, నాగేశ్వరరావు, నీలేశ్వరరావు, శ్రావణ్‌రెడ్డి, ఇస్మాయిల్ ఖాన్ ఎంపికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్ యాదవ్, శ్రీధర్‌రెడ్డి, రాంగోపాల్, నారాయణరెడ్డి, కిషోర్, రాములు యాదవ్ ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా మంజుల,అష్రఫ్ అలీ, నాగార్జున, మనీష్‌రెడ్డి, రాజేష్, రవి, నారాయణ, జగదీష్, వాజిద్ హుస్సేన్, శివప్రసాద్, సైదులు, షేక్ సర్వార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పొట్టు లారీ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే సంఘం ప్రధాన లక్ష్యమని తెలిపారు. లారీలకు సరైన కిరాయిలు లభించకపోవడం, డీజిల్ ధరలు, నిర్వహణ ఖర్చులు పెరగడం, డ్రైవర్ల సమస్యలు, పొట్టు మిల్లులు, వివిధ కంపెనీల వద్ద లారీ యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సంఘం ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

లారీయజమానుల సమస్యలను జిల్లాల వారీగా గుర్తించి పరిష్కారం సాధించేలా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో పొట్టు మిల్లులు,కంపెనీల యాజమాన్యాలతో చర్చలు జరిపి లారీ యజమానులకు న్యాయం జరిగేలాకృషి చేస్తామని స్పష్టం చేశారు. కొత్తగా ఎన్నికైన రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పొట్టు లారీ యజమానుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత నిస్తూ సంఘాన్ని ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. లారీ యజమానుల సంక్షేమమే ధ్యేయంగా, వారి ఇబ్బందులకు అండగా నిలిచే బలమైన సంఘంగా తెలంగాణ పొట్టులారీ యజమానుల సంక్షేమ సంఘాన్ని తీర్చిదిద్దుతామని నూతన కమిటీ సభ్యులు ప్రకటించారు.



# సరళారెడ్డికి జర్నలిస్టు సంఘం నేతల నివాళులు

భద్రాచలం, మహానది న్యూస్, సెప్టెంబర్ 09: భద్రాచలం టీవీ9 రిపోర్టర్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కర్ర అనిల్ రెడ్డి సతీమణి స్వర్గీయ కర్ర సరళారెడ్డి కి పలువురు జర్నలిస్టు సంఘం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం భద్రాచలంలో స్వర్గీయ సరళారెడ్డి దశదిన కర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు చిర్రా శ్రీనివాస్ గౌడ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సామాజిక తెలంగాణ స్టాఫ్ రిపోర్టర్ పొదిల సుబ్బారావు, పినపాక నియోజకవర్గం నవభారత్ న్యూస్ పేపర్ ఆర్‌సీ ఇన్‌చార్జ్ తేజావత్ సురేష్, పినపాక నియోజకవర్గం టీవీ ఫైవ్ రిపోర్టర్ జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు హాజరై సరళారెడ్డి చిత్రపటానికిపూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కర్ర అనిల్ రెడ్డిని,వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతితెలిపారు. సరళారెడ్డి మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# సీతాఫల్‌మండి స్టేషన్‌లో రైల్వే జీఎం తనిఖీ

## సిగ్నలింగ్ వ్యవస్థ, పాయింట్లు, క్రాసింగ్‌ల పరిశీలన.. భద్రతా అంశాలపై సమీక్ష





**సికింద్రాబాద్, మహానది న్యూస్, సెప్టెంబర్ 09:** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ బుధవారం సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్ ప్రాంతాన్ని సందర్శించి రైల్వే నిర్వహణ, భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలోని సిగ్నలింగ్ వ్యవస్థ పనితీరును, వివిధ సిగ్నలింగ్ ఆస్తుల నిర్వహణను ఆయన తనిఖీ చేశారు.

స్టేషన్ పరిధిలోని పాయింట్లు, క్రాసింగ్‌లను పరిశీలించిన జీఎం వాటి పనితీరు, నిర్వహణ తీరును సమీక్షించారు. రైళ్ల సురక్షిత రాకపోకలకు సిగ్నలింగ్‌వ్యవస్థ, పాయింట్లు, క్రాసింగ్‌లు కీలకమైనందున వాటి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. అనంతరం రైల్వే కార్యకలాపాలకు సంబంధించిన భద్రతా అంశాలను సమీక్షించిన సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, ప్రయాణికులు, రైల్వే సిబ్బంది భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ, సాంకేతిక వ్యవస్థల పనితీరును ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని సూచించారు. రైల్వేలో సురక్షితమైన, సమర్థవంతమైన రైళ్ల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలను నిరంతరం చేపట్టాలని ఆయన అధికారులకు స్పష్టం చేశారు. సిగ్నలింగ్, ట్రాక్‌కు సంబంధించిన కీలక పరికరాలు, పాయింట్లు, క్రాసింగ్‌ల నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. జీఎం తనిఖీ సందర్భంగా సంబంధిత రైల్వే అధికారులు ఆయన వెంట ఉండి ఆయా విభాగాల పనితీరు, భద్రతా చర్యలపై వివరాలు అందించారు.

# ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌కు మధుయాష్కీ గౌడ్ శుభాకాంక్షలు

## పుష్పగుచ్ఛం అందజేసి అభినందించిన టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్



**ఎల్బీనగర్, మహానది న్యూస్, సెప్టెంబర్ 09:** ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ జన్మదినం సందర్భంగా టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనిల్ కుమార్ యాదవ్‌ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని మధుయాష్కీ గౌడ్ ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో అనిల్ కుమార్ యాదవ్ చేస్తున్న కృషి మరింత విజయవంతంకావాలని ఆయనకోరారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్‌గౌడ్ పాల్గొని ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు పరస్పరం అభినందనలు తెలియజేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా ఎంపీకి శుభాకాంక్షలు తెలిపారు.

# దక్షిణ మధ్య రైల్వే జీఎంతో ఎంపీ రఘునందన్‌రావు భేటీ

# మెదక్ ప్రాంత రైల్వే అభివృద్ధి ప్రణాళికలపై చర్చ



సికింద్రాబాద్, మహానది న్యూస్, సెప్టెంబర్ 09: మెదక్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన రైల్వే అభివృద్ధి అంశాలపై ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవతో సమావేశమయ్యారు. బుధవారం సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయం రైల్ నిలయంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా మెదక్ పార్లమెంట్ పరిధిలో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి, రైలు సేవల విస్తరణకు సంబంధించిన పలు అంశాలపై ఎంపీ జీఎంతో చర్చించారు.

తన ప్రాంతానికి సంబంధించిన రైల్వే అభివృద్ధి ప్రణాళికలు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలను ఆయన జీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా రైల్వే సదుపాయాలను మరింత మెరుగుపరచడం, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం వంటి అంశాలపై సమావేశంలో చర్చ జరిగినట్లు దక్షిణ మధ్య రైల్వే వర్గాలు తెలిపాయి. మెదక్ ప్రాంత అభివృద్ధిలో రైల్వే రవాణా వ్యవస్థ కీలకంగా ఉన్న నేపథ్యంలో, అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీ కోరినట్లు సమాచారం. ఎంపీ రఘునందన్‌రావు ప్రస్తావించిన ప్రాంతీయ రైల్వే అభివృద్ధి అంశాలను జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ పరిశీలించి, సంబంధిత అంశాలపై అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు చేపట్టే దిశగా చర్చించారు. ఈ సమావేశం ద్వారా మెదక్ పార్లమెంట్ పరిధిలో రైల్వే అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలు మరోసారి అధికారుల దృష్టికి వెళ్లాయి.

# శాసనసభ గౌరవాన్ని కాపాడాలి: ఎమ్మెల్యే కసిరెడ్డి

## స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు సంఘీభావం.. మంత్రి శ్రీధర్‌బాబుకు విజ్ఞప్తి

**కల్వకుర్తి, మహానది న్యూస్, సెప్టెంబర్ 09:** శాసనసభలో సభా మర్యాదలు, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం అసెంబ్లీలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవితో కలిసి రాష్ట్ర అసెంబ్లీ వ్యవహారాల ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల శాసనమండలి సభ్యుడు తాతా మధు స్పీకర్ పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలు, ప్రవర్తనపై ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు తన సంఘీభావాన్ని తెలిపారు. శాసనసభ అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక అని, సభలో సభ్యులు వ్యవహరించే తీరు ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సినఅవసరం ఉందని పేర్కొన్నారు.

అనంతరం అసెంబ్లీ వ్యవహా రాల ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబును కలిసి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. సభా గౌరవం, ప్రతిష్ఠకు భంగం కలిగించే



విధంగా ఎవరూ వ్యవహరించకుండా అవసరమైన కఠిన చర్యలు తీసు కోవాలని విజ్ఞప్తి చేశారు. శాసనసభ ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రజా సమస్యలపై చర్చలు, నిర్ణయాలు జరిగే పవిత్రవేది కగా సభను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి సభ్యుడిపై ఉందని కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత వ్యాఖ్యలు, అనుచిత ప్రవర్తనకు తావులేకుండా సభా సంప్రదాయాలను కాపాడుకోవాలని ఆయన సూచించారు.

# గుండూర్‌లో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



## అర్హులైన లబ్ధిదారులకు కార్డులు అందజేత

కల్వకుర్తి, మహానది న్యూస్, సెప్టెంబర్ 09 : గ్రామంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. స్మార్ట్ రేషన్ కార్డులు పొందిన లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ వెంకటయ్య మాట్లాడుతూ పేద, నిరుపేద కుటుంబాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అందులో భాగంగా పేదలకు ఉచితంగా సన్నబియ్యం అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. నూతన స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ లక్ష్మమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రేషన్ కార్డుల ద్వారా పేద కుటుంబాలకు ఆహార భద్రతతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వెంకటరమణ రెడ్డి, సీనియర్ నాయకులు నంబి శంకర్, పోతుగంటి రాజు, వార్డు సభ్యురాలు మెంట జంగమ్మ, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, తుంగభద్ర వెంకటయ్య, భీమయ్య, ప్రతాప్ రెడ్డి, నంబి వీరయ్య, మెంట లింగమయ్య, మెంట పరమేశ్, నంబి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# వనస్థలిపురం అభివృద్ధికి ప్రాధాన్యత..

## - మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి



వనస్థలిపురం, మహానది న్యూస్, సెప్టెంబర్ 09: వనస్థలిపురం డివిజన్‌లోని తిరుమల కాలనీలో కొత్తగా మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పనులను ఉదయం నుంచే ప్రారంభించేలా కాంట్రాక్టర్‌కు డివిజన్ మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. కాలనీ అభివృద్ధిలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో పాటు పనులు ప్రారంభం కానుండటంతో తిరుమల కాలనీ అసోసియేషన్ సభ్యులు, అధ్యక్షులు, కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. రోడ్ల నిర్మాణంతో స్థానికంగా రాకపోకలకు ఇబ్బందులు తొలగి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని వారు తెలిపారు. కాలనీ అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తూ సీసీ రోడ్ల పనులు మంజూరు చేయించడంలో చొరవ చూపిన రాగుల వెంకటేశ్వర్‌రెడ్డికి కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. తిరుమల కాలనీ అభివృద్ధే లక్ష్యంగా, ప్రజల సౌకర్యానికి ప్రాధాన్యతనిస్తూ అవసరమైన అభివృద్ధి పనులను కొనసాగిస్తామని రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. సీసీ రోడ్ల పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు.

# సంపాదకీయం

## చావొక్కటే.. అన్నింటికీ పరిష్కారం కాదు

జీవితంలో ఎదురయ్యే ఎలాంటి కష్టాన్నైనా ఎదుర్కోవాలి! ఎవరి జీవితం కూడా పూల పాన్పు కాదు. ఈ డైలాగ్‌ని.. మన జీవితంలో ఎప్పుడో ఒకసారి వినే ఉంటాం. ఎక్కడో ఓ చోట చదివే ఉంటాం. లైఫ్ అంటే.. ఎప్పుడూ సుఖంగా, అన్ని రోజులూ సంతోషంగా ఉండదని తెలుసు. కష్టాలు, సుఖాలు, సవాళ్లు, సమస్యలు.. అందరికీ ఉంటాయ్. ఇవన్నీ.. ఏదో ఒక ఫేజ్‌లో ఎదుర్కోక తప్పదు. అయినా సరే.. జీవితంలో ఎదురయ్యే ఎలాంటి కష్టాన్నైనా.. ఎదుర్కోవాలి. వాటన్నింటిని ధైర్యంగా దాటుకొని.. ముందుకు సాగాలి. కానీ.. ఈరోజులు అలా లేవు. కాలం మారేకొద్దీ.. పబ్లిక్ మరింత వీక్‌గా తయారవుతున్నారు. చిన్న చిన్న విషయాలకే.. చాలా పెద్ద నిర్ణయాలు తీసుకుంటున్నారు. తనువు చాలిస్తున్నారు. సమస్య వస్తే చాలు.. దాన్ని ఎదుర్కోలేక చచ్చిపోతున్నారు. ఇటీవలి కాలంలో చిన్నా, పెద్ద, యువత, ముసలి, ముతకా అనే తేడా లేదు. అందరిదీ అదే దారి. ఎంతో అందమైన జీవితాన్ని గెలవలేక.. అర్ధాంతరంగా చనిపోతున్నారు. అసలు.. ఓ చిన్న సమస్యని కూడా ఎదుర్కొనే ధైర్యం లేకుండా ఎలా ఉంటున్నారు? దేనినైనా తట్టుకోగలిగే, ఎదుర్కోగలిగే ఆత్మవిశ్వాసం ఏమైపోయిందనే ప్రశ్నలే.. ఇప్పుడు అందరిలోనూ తలెత్తుతున్నాయ్. సీఏ పరీక్షల్లో ఫెయిల్ అవడంతో విశాఖలో యువకుడు ఆత్మహత్య సీఏ పరీక్షల్లో ఫెయిల్ అవడంతో.. తల్లిదండ్రులను మోసం చేశాననే మనస్తాపంతో విశాఖలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కొబ్బరితోట ఏరియాలో ఓ గదిని అద్దెకు తీసుకొని.. హీలియం గ్యాస్‌తో ముఖానికి కవర్ తగిలించుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు..మళ్లీ పాస్ అయ్యే చాన్స్ ఉంటుంది హైదరాబాద్‌లో రెండేళ్ల కూతురితో తల్లి ఆత్మహత్య హైదరాబాద్‌లో కుటుంబ కలహాలతో.. హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంది కీర్తిక అగర్వాల్. తనతో పాటు రెండేళ్ల చిన్నారి ప్రాణాన్ని కూడా తీసుకెళ్లిపోయింది. ఫ్యామిలీలో గొడవలున్నంత మాత్రాన, భర్తతో మనస్పర్థలు వచ్చినంత మాత్రాన.. చావే పరిష్కారమా? అంతగా ఇబ్బంది ఉంటే.. పెద్దవాళ్లను కూర్చోబెట్టి మాట్లాడటమో, కౌన్సిలింగ్ తీసుకోవడమో చేయాలి గానీ.. ఇలా ప్రాణాలు తీసుకోవడమేంటి? చిన్న చిన్న సమస్యలకే ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన ఎందుకొస్తోంది? అనేదే.. ఎవ్వరికీ అంతుబట్టడం లేదు. తిరుపతిలో ఇంజనీరింగ్ చదువుతున్న 20 ఏళ్ల చందు అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. తూర్పుగోదావరి జిల్లాలో.. తొర్రేడు తిరుమల కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న ఎల్ల సత్యదేవకుమార్ ఆత్మహత్య చేసుకున్నాడు. హాస్టల్‌లో తండ్రి దించి వెళ్లిన కొన్ని గంటల్లోనే.. సూసైడ్ చేసుకున్నాడు. హాస్టల్‌లో ఉండనని, ఇంటి దగ్గరే ఉండి చదువుకుంటానని మారాం చేశాడు. తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో.. ఆత్మహత్యే శరణ్యం అనుకున్నాడు. తల్లిదండ్రులు ఒప్పుకోకపోతే.. వారిని ఒప్పించే ప్రయత్నం చేయాలి. కూర్చోబెట్టి నచ్చజెప్పాలి. ఒకసారి కాకపోయినా.. మరోసారి వింటారు. కానీ.. హాస్టల్లోనే ఉండమన్నారనే బాధతో ప్రాణాలు తీసుకోవడమేంటి? చిత్తూరు జిల్లా సీతమ్స్ కాలేజీలో ఇంజనీరింగ్ స్టూడెంట్ సూసైడ్ చిత్తూరు జిల్లాలో సీతమ్స్ కాలేజీలో ఇంజనీరింగ్ స్టూడెంట్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మూడో అంతస్తు నుంచి దూకి చనిపోయాడు. కుటుంబంలో తీరని విషాదాన్ని మిగిలిస్తున్నారు. ప్రతి ప్రశ్నకు సమాధానం ఉన్నట్లే.. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది. ప్రతి చీకటి వెనుక.. ఓ వెలుగు రేఖ దాగి ఉంటుంది. సమస్య ఎలాంటిదైనా.. పరిష్కారం ఓపిగ్గా ఆలోచించి వెతుక్కోవాల్సింది మనమే. సమస్యల్ని ధైర్యంగా ఎదుర్కొని.. జీవితాన్ని గెలవాల్సిందే! కానీ.. దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న ఆత్మహత్యల పరంపర చూస్తుంటే.. సమాజం ఎటు వైపు పోతుందోనన్న భయం కలుగుతోంది. ప్రతి ఒక్కరూ.. చావే పరిష్కారమనే మూర్ఖపు ఆలోచనల నుంచి బయటకు రాకపోవడమే.. గుండెల్ని పిండేస్తోంది. ఇప్పటికే ఉన్న ఆత్మహత్యల ఆందోళనల్ని మరింత పెంచుతోంది. మరి.. దీనికేంటి పరిష్కారం? చాలా మందిలో సన్నగిల్లుతున్న ఆత్మవిశ్వాసం కారణాలు ఏవైనా కావొచ్చు.. సమస్య ఎలాంటిదైనా ఉండొచ్చు.. కానీ.. తీరిగ్గా ఆలోచిస్తే ప్రతి ప్రాబ్లమ్‌కి.. కచ్చితంగా సొల్యూషన్ దొరుకుతుంది. కానీ.. ఏదైనా సమస్య వస్తే.. దాన్ని తట్టుకునేంత ఆత్మవిశ్వాసం చాలా మందిలో సన్నగిల్లుతోంది. వరుస ఆత్మహత్యల్ని చూశాక.. అర్థమవుతున్నది ఇదే. మార్కులు తక్కువొచ్చాయని, ఎగ్జామ్‌లో ఫెయిలయ్యామని, ప్రేమలో విఫలమయ్యామని, ఆర్థికంగా నష్టపోయామని, సోషల్ మీడియాలో ట్రోల్స్, కుటుంబ కలహాలు, వేధింపులు.. ఇలా చెప్పుకుంటూ పోతే.. అనేక కారణాలున్నాయ్. జీవితంలో భాగంగా ఎదురయ్యే చిన్న ఫెయిల్యూర్‌కి కూడా.. జీవితమే అంతమైపోయినట్లు భావిస్తున్నారు. ప్రతి సమస్యకు.. ఇన్‌స్టంట్ రిలీఫ్ కావాలి. ఎలాంటి ఇబ్బంది ఎదురైనా.. వెంటనే పరిష్కారం దొరికేయాలనుకుంటారు. సొల్యూషన్ కాస్త లేటైనా.. లైఫ్ ఎండింగ్ డెసిషన్ తీసేసుకుంటున్నారు. ఇతరుల జీవితాలతో పోల్చుకుంటూ.. తాము ఎందుకూ పనికిరామని నిరాశ చెందుతున్నారు. మిగతా వాళ్లలా.. తమ లైఫ్ ఎందుకు లేదని బాధపడుతుంటారే తప్ప.. వారి స్థాయికి ఎదగాలని అనుకోవడం లేదు. ఈ సోషల్ కంపారిజన్స్ కూడా.. సూసైడ్స్‌కి ఓ రీజన్‌గా కనిపిస్తోంది. చాలా మంది తమ సమస్యలకు పరిష్కారంపై దృష్టి పెట్టకుండా.. ఇతరులతో పంచుకోకుండా.. వాళ్లకు వాళ్లే కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఎంతోమందిపై..వారు పెరిగిన కుటుంబ, సామాజిక వాతావరణం కూడా ప్రభావం చూపుతోంది.పిల్లల మార్కుల కోసం, ర్యాంకుల కోసం పేరెంట్స్ చేసే ప్రెజర్‌ని తట్టుకోలేని వాళ్లు చాలా మంది ఉంటున్నారు. వారు.. తమ తల్లిదండ్రుల ఆశల్ని అందుకోలేకపోయినప్పుడు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఇక.. కుటుంబంలో ఉండే వాతావరణం కూడా వారి జీవితాలపై ప్రభావం చూపుతోంది. తమ సమస్యలు పంచుకునే వాతావరణం లేకపోవడం, ఒంటరితనం పెరగడం లాంటివి.. తనువు చాలించాలనే నిర్ణయాలకు దారి చూపుతున్నాయ్. ఆత్మహత్య.. ఎప్పటికీ సమస్యకు పరిష్కారం కాదు. పైగా.. అది ఎవరూ పరిష్కరించలేని మరో సమస్యని సృష్టిస్తుంది. తమనే నమ్ముకున్న వారి జీవితాలను ప్రశ్నార్థకం చేస్తుంది. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి బాధ అక్కడితో అంతమవుతుంది. కానీ.. ఆ బాధ మొత్తం కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, శ్రేయోభి లాషులకు వారసత్వంగా మిగులుతుంది. ఇది.. మిగతా వారి జీవితాలపై ప్రభావం చూపుతుంది. జీవితమనేది.. ఆ భగవంతుడు ఇచ్చిన బహుమ తి. జీవితమనేది.. లైఫ్ జర్నీలో ఎదురయ్యే సంఘటనలతో అనుభవాలని నేర్చుకునేందుకు, అప్పుడప్పుడు వచ్చే సమస్యలను అధిగమించేందుకు.. ఓ చక్కని అవకాశం. ప్రతి సమస్య ఓ పాఠాన్ని నేర్పుతుంది. చచ్చేంత ధైర్యం.. బతకడానికి ఎందుకు లేదనే ప్రశ్న కూడా ఇప్పుడు ఉత్పన్నమవుతోంది. ఆత్మహత్యకు ప్రయత్నించే వ్యక్తిలో అపారమైన ధైర్యం, కఠినమైన నిర్ణయం తీసుకునే శక్తి ఉంటుంది. ఆత్మహత్యకు ప్రయత్నించే వ్యక్తిలో అపారమైన ధైర్యం, కఠినమైన నిర్ణయం తీసుకునే శక్తి ఉంటుంది. అదే ధైర్యాన్ని.. జీవితంలో ఎదురయ్యే సవాళ్లని ఎదుర్కొనేందుకు, పోరాడేందుకు ఉపయోగిస్తే పరిస్థితులు పూర్తిగా మారిపోతాయ్. జీవితం లో ఎదురయ్యే కష్టాలకు ముగింపు ఆత్మహత్య కాదు.. సమస్యలున్నోళ్లు ఎవరైనా ఆలోచించాల్సింది.. అత్మహత్యలు ఎలా చేసుకోవాలని కాదు. సమస్య నుంచి పారిపోవడం కాదు.. పోరాడటం నేర్చుకోవాలి. ఓటమే.. అంతం అనుకోవద్దు. అదొక పాఠంగా భావించాలి.

# పులులతోనే అడవులకు మనుగడ..!



పర్యావరణానికి పులులకు అవినాభావ సంబంధం ఉంది. అడవులను రక్షించుకోవాలంటే జంతువుల మనుగడ సాగాలి. జంతువులను కాపాడుకుంటేనే అడవులు పచ్చగా ఉంటాయి. ప్రకృతిని విధ్వంసం చేస్తున్న ప్రజలు అడవులను, కొండలను ధ్వంసం చేయడంతో అక్కడక్కడా ఉన్న పులులు నగరాల మీదకు వస్తున్నాయి. వాటిని చూసి వామ్మో పులి అంటూ పరుగెడుతున్నాయి. అడవులు చక్కగా ఉన్నంత కాలం అవి అక్కడే మనగుడ సాగించాయి. ఒక్క పులులే కాదు. సమస్య జంతుజాలంనకు అడవులే ఆవాసం. వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిది. అవి ఉంటేనే అడవులు, ప్రకృతి పచ్చగా ఉంటాయి. అలాంటి అడవులను యధేచ్ఛగా నరికేస్తున్నాం. కొండలను ధ్వంసం చేస్తున్నాం. దీంతో పులులు, చిరుతలు అడపాదడపా అడవుల శివారు గ్రామాల్లోకి వస్తున్నాయి. ఆహారం, నీరు కోసం తంటాలు పడుతున్నాయి. ఇప్పటికే కోతులు మనుషలను మించి గ్రామాల్లో సంచరిస్తున్నాయి. వీటిని తరిమికొట్టే చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఇవి ప్రజల ఆస్తులను, పంటలను ధ్వంసం చేస్తున్నాయి. మనుషులపై పడి కరుస్తున్నాయి. ఇకపోతే తెలుగు రాష్ట్రాల్లో ఈ మధ్య పులుల, చిరుతల సంచారం అడపదడపా కనిపిస్తోంది. నల్లమల, తిరుమల కొండలతో పాటు తెలంగాణ జిల్లాల్లోని అటవీ ప్రాంతంలో వీటి సంచారాం పెరిగింది. అటవీ అధికారుల లెక్కల ప్రకారం ఉభయ రాష్ట్రాల్లో పులుల సంచారం ఎక్కువైంది. ఓ వైపు మహారాష్ట్రలోని తాడోబా నుంచి, మరో వైపు నల్లమల నుంచి టైగర్లు కొత్త ఆవాసాలను వెతుక్కుంటూ సరిహద్దుల్లోని పలు జిల్లాల్లో తిరుగుతున్నాయి. తాడోబాలో పులుల సంతతి పెరిగిపోవడం.. అంతర్గత సంఘర్షణల వల్లే పులులు గోదావరి దాటి ఆసిఫాబాద్ జిల్లాలోకి అడుగుపెడుతున్నాయని, అక్కడి నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ మీదుగా జిల్లాల్లోకి ప్రవేశిస్తున్నాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. మహారాష్ట్ర లేదా ఛత్తీస్‌గఢ్ నుంచి ఓ పులి గోదావరి దాటి వచ్చినట్టు అనుమానిస్తున్నారు. పులుల సంచారం పెరగడంతో వీటు అప్రమత్తం అయ్యారు. స్థానికులు, వేటగాళ్ల నుంచి ముప్పు పొంచి ఉండడంతో ప్రత్యేక బృందాల ద్వారా గస్తీ కాస్తున్నారు. సోమశిల పరిధిలో ఓ పులి సంచారంతో యంగంపల్లితండా దాని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు. నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ వైపు నుంచి కృష్ణా నదిని ఈదుకుంటూ వచ్చిన ఓ పెద్దపులి తమ ప్రాంతంలో సంచరిస్తోందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గ్రామస్తుల సమాచారంతో అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతాన్ని జల్లెడ పట్టగా.. వ్యవసాయ పొలాల్లో పులి పాదముద్రలు కనిపించాయి. ఇకపోతే ఇటీవల గుర్తు తెలియని వాహనం ఢీకొని ప్రకాశం జిల్లాలో ఓ పులి మృత్యువాత పడింది. సాధారణంగా వేసవి కాలంలో పులులు రిజర్వ్ ఫారెస్ట్ వైపు నుంచి అమ్రాబాద్ వైపు సంగమేశ్వర ప్రాంతం గుండా నదిని దాటుతుంటాయి. రెండు రాష్ట్రాల సరిహద్దులు దగ్గరగా ఉండటం, అక్కడ నీటి లోతు తక్కువగా ఉండడంతో పులులు కొల్లాపూర్ ఫారెస్ట్ లిమిట్స్‌లోని మార్గాన్ని ఎంచుకుంటాయని అధికారులు చెబుతున్నారు. గతంలో మహారాష్ట్ర నుంచి వచ్చే ఒకటో రెండో పులులను కాపాడేందుకే అష్టకష్టాలు పడ్డ ఫారెస్ట్ ఆఫీసర్లకు ఇప్పుడు పెద్దసంఖ్యలో వస్తున్న పులులను రక్షించడం పెను సవాల్‌గా మారింది. టైగర్ కారిడార్‌లోని అడవుల్లో ఇటీవలి కాలంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి పులులను ట్రాక్ చేస్తున్నారు. వాటి కదలికలను నిత్యం గమనించేందుకు టైగర్ ట్రాకర్లను సైతం నియమించారు. అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా వేటగాళ్ల రూపంలో పెద్దపులులు ప్రాణాలు కోల్పోతున్నాయి. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 36 నుంచి 45 వరకు పులులు ఉన్నాయని చెబుతున్నారు. పులులు సంచరిస్తున్న అటవీ ప్రాంతాల్లో ఎలాంటి ఉచ్చులు బిగించకూడదని, పులి కదలికలు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

# ఆక్వాలో ట్రంప్ టారిఫ్‌ల అలజడి



### తాజాగా 500 శాతం ప్రకటనతో రైతులు బెంబేలు
### ఓ వైపు వ్యాధులు, మరోవైపు ఎగుమతుల్లో ఒడిదుడుకులు

రాజమహేంద్రవరం : అమెరికా విధించిన టారిఫ్‌లతో మన రొయ్య ఎదురీదుతోంది. ఓ వైపు వాతావరణ మార్పులతో వ్యాధుల కారణంగా ఎదుగుదల లోపం, మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న టారిఫ్‌లతో రొయ్యల సాగుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. విదేశీ ఎగుమతులపైనే గోదావరి జిల్లాలో ఆక్వా సాగు జరుగుతోంది. 500 శాతం సుంకాలు పెంచుతామంటూ ట్రంప్ చేసిన తాజా ప్రకటించారు. అమెరికాలో ఈ బిల్లు ఈ నెల 15న సనెట్‌కు వెళ్లే అవకాశం ఉంది. దీంతో, ఆక్వా రైతులు, వ్యాపారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 77,150 ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. గతంలో 85 వేల ఎకరాల్లో ఆక్వా సాగు ఉండేది. గతేడాది నుంచి ట్రంపు సుంకాల నేపథ్యంలో చాలా మంది రైతులు ఆక్వా నుంచి తప్పుకున్నారు. ఇక్కడ 30 నుంచి 100 కౌంట్ వరకూ రొయ్య లను సాగుచేస్తున్నారు. 30 నుంచి 40 కౌంట్ సాగు ఎక్కువగా ఉంది. ఇదంతా అమెరికా ఎగుమతులను దృష్టిలో పెట్టుకునే సాగు చేస్తున్నారు. ఈ కౌంట్‌లో 60 శాతం రొయ్యలు అమెరికాకే ఎగుమతి అవుతున్నాయి. గతంలో ట్రంప్ విధించిన 50 శాతం సుంకాల నేపథ్యంలో ఆక్వా పరిశ్రమ తీవ్ర ఒడిదుడుకులకు లోనైంది. కనీసం ధర లేకరైతులు ఇబ్బందులు పడ్డారు. దీంతోచాలామంది ఆక్వా రైతులు స్థానికంగానే వీటిని అమ్ముకోవాల్సి వచ్చింది. గిట్టుబాటు కాకున్నా పంటను వచ్చిన కాడికి రైతులు అమ్ముకునే పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం రైతుల నుంచి 30 కౌంట్ రొయ్యలు కేజీ రూ.400కు, వంద కౌంట్ కేజీ రూ.240కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. 50 శాతం సుంకాల తర్వాత ఇప్పుడిప్పుడే ఆక్వా రైతు కోలుకుంటున్నారు. ఈ సమయంలో 500 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించడంతో ఎగుమతిదారులు, రైతుల్లో మళ్లీ ఆందోళన మొదలైంది. జనవరి 15 తర్వాత అక్కడి దిగుమతిదారులు పెట్టే కొత్త ఆర్డర్లపైనే మన రొయ్యల మార్కెట్ ఆధారపడి ఉంటుంది. దీంతో, అమెరికాలో దిగు మతి చేసుకునే వ్యాపారులు ఏ నిర్ణయం తీసుకుంటారో అనేదానిపై ఎగుమతిదారులు ఉత్కంఠగా ఉన్నారు. అక్కడ డిమాండ్‌ను బట్టి ఆర్డర్లు ఉంటాయి. ఇప్పటికే అమెరికా వ్యాపారులు టారిఫ్‌పై అక్కడి న్యాయస్థానాలను ఆశ్రయించారు. వాటి తీర్పుపై భవిష్యత్తు టారిఫ్ ఆధారపడి ఉంటుంది. అమెరికాకు ఎగుమతులు మందగిస్తే యూరప్, జపాన్, చైనా తదితర దేశాలపై ఇక్కడి ఆక్వా రైతులు ఆధారపడాల్సి వస్తుంది. ఇప్పటికిప్పుడు అంత విదేశీ మార్కెట్‌ను పెంచుకునే అవకాశం లేకపోవడంతో వారంతా ఆందోళనతో ఉన్నారు. అమెరికా లో మాత్రమే 30 నుంచి 40 కౌంట్ రొయ్యలను వినియోగిస్తారు. చైనా, జపాన్ దేశాల్లో వంద కౌంట్ వినియోగం ఎక్కువ. అయితే వంద కౌంటు రొయ్యలను ప్రోసెసింగ్ చేయాలంటే వ్యయప్రయాసల ను భరించాలి. అదే ఇప్పుడు ఎగుమతిదారులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. గతేడాది నుంచి వచ్చిన ట్రంప్ టారిఫ్ విధానంతో ఇక్కడ రైతులు ఉత్పత్తి తగ్గించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏటా ఆరు లక్షల టన్నుల రొయ్యలను ఉత్పత్తి చేస్తున్నారు.

వెంటాడుతున్న వ్యాధులు: కొన్నేళ్లుగా వరస తుపాన్ల నేపథ్యంలో చెరువుల్లో నీరు మారి 'ఎంటిరో సైటోజూన్ హిపటోప్నైె (ఇహెచ్‌పి) అనే వ్యాధి సోకింది. దీంతో, రొయ్యల్లో ఎదుగుదల లోపం తలెత్తింది. సాధారణంగా జిల్లాలో జులై వరకు మొదటి పంట, ఆగస్టు నుంచి రెండో పంట వేస్తారు. తొలి పంటను పరీక్షించకుండానే రెండో పంటను రైతులు సాగు చేశారు. నేషనల్ సర్వే లైన్స్ ప్రోగ్రాం ఆన్ ఆక్వాటిక్ యానిమల్ డిసీజ్ (నాస్‌పాడ్) భాగంగా మత్స్యశాఖ పరీక్షలు చేయగా, 96 ఇహెచ్‌పి పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

# కాలుష్య కట్టడి ఎలా...

ముంబై నగర వాయు కాలుష్య సంక్షోభంపై బాంబే హైకోర్టు సుమోటోగా విచారణ చేపట్టి ఏళ్లు గడుస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి మారకపోవడానికి ప్రధాన కారణం డేటా లేకపోవడం . నిబంధనల అమలు లో వైఫల్యమేనని స్పష్టమవుతోంది. గాలి నాణ్యత క్షీణతకు, ఊపిరితిత్తుల వ్యాధులకు ప్రత్యక్ష సంబంధం ఉన్నట్లు ఎటువంటి ఆధారాలు లేవని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో పేర్కొనడం అందరి దృష్టిపథంలో ఉంది. అదే సమయంలో అసలు దానికి సంబంధం ఉందో లేదో నిర్ధారించే డేటా సేకరణ మాత్రం జరగలేదు. సెన్సార్లు పనిచేయకపోవడం అన్నది గాలి కాలుష్యం విషయానికి సంబంధించిన ఆందోళనలో ఒక పరిపాటిగా మారిపోయింది. కాలుష్య నియంత్రణ సెన్సార్లు అనేకచోట్ల పని చేయడం లేదని బాంబే హైకోర్టు స్వయంగా గుర్తించింది. నిర్మాణ ప్రాంతాల్లో కాలుష్య నివారణ మార్గదర్శకాలను అమలు చేస్తున్నట్లు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ రికార్డుల్లో చూపిస్తున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. అధికారిక డేటా అంతా బాగున్నట్లు భ్రమింపజేస్తున్నా, జనం అనుభవిస్తున్న కాలుష్యం మాత్రం వేరే కథ చెబుతోంది. జనసాంద్రతకు అనుగుణంగా సెన్సార్ నెట్‌వర్క్ లేకపోవడంతో, కోర్టులు కూడా సరైన సమాచారం లేని శూన్య స్థితిలో నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తోంది.పాండమిక్ తర్వాత మనం ఎదుర్కొంటున్న అతిపెద్ద ఆరోగ్య సంక్షోభం వాయు కాలుష్యమే అయినప్పటికీ, దీనిపై తగినంత శ్రద్ధ లేకపోవడం విచారకరం. ముంబై, ఢిల్లీ వంటి నగరాల్లో శ్వాస పీల్చడం అంటే రోజుకు పదుల సంఖ్యలో సిగరెట్లు తాగడంతో సమానమని వార్తలు వస్తున్నా, జనం దాన్ని అలవోకగా తీసుకుంటున్నారు. ఇది కేవలం ఆరోగ్య సమస్యే కాదు, పెరుగుతున్న వైద్య ఖర్చుల వల్ల దేశంపై భారీ ఆర్థిక భారంగా పరిణమిస్తోంది. ముక్కలు ముక్కలుగా ఉన్న నిబంధనలు, ఆచరణకు సాధ్యం కాని విధానాల వల్ల వాయు స్వచ్ఛత లక్ష్యాలు నెరవేరడం లేదు.ఈ పరిస్థితికి చాలా కారణాలున్నాయి. సరైన నియంత్రణలు లేకపోవడం...వాటిని అమలు చేయడంలో సమన్వయ లోపం, ఆశావహ విధానాలు లేకపోవడం.. వాస్తవికత ఆధారంగా పనిచేయకపోవడం ఇవన్నీ కారణాలే. స్వచ్ఛమైన గాలి కోసం మనం విధించుకునే లక్ష్యాలు..వేగంగా పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థ అవసరాల మధ్య సమతుల్యం కూడా అవసరమే. నా దృష్టిలో, ఇవన్నీ రెండు ప్రధాన లోపాలున్నాయి. ఒకటి డేటా లేకపోవడం.. అదే ముఖ్యమైంది. ఇక రెండోది ప్రత్యక్ష ఆర్థిక ప్రోత్సాహకాలు, జరిమానాలు లేకపోవడం. (కాలుష్య నియంత్రణకు సంబంధించి) ఈ వ్యాసంలో ప్రస్తావించిన ఇతర కారణాలు సహా మిగతా అన్ని అంశాలు..ఈ మొదటి లోపాన్ని సరిదిద్దకుండా పరిష్కరించలేము.కాలుష్యాన్ని నియంత్రించాలంటే ప్రతి వార్డులో, ప్రతి లోకాలిటీలో తక్కువ ఖర్చుతో కూడిన ఆధునిక సెన్సార్లను ఏర్పాటు చేయాలి. కేవలం ముంబైని మాత్రమే కాకుండా, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ మొత్తాన్ని ఒకే 'ఎయిర్ షెడ్'గా పరిగణించి అధ్యయనం చేయాలి. సముద్రపు గాలుల వల్ల కాలుష్యం ఎక్కడి నుంచి ఎక్కడికి చేరుతుందో తెలిస్తేనే మూలాలను అరికట్టగలం. 2023లో ఎమ బాంబే, ఔఇఇటీఎ వంటి సంస్థలు ఇచ్చిన నివేదికలను ఇప్పటికైనా అమలు చేయాలి. వీటితో పాటు, కాలుష్యం తగ్గించే వారికి పన్ను రాయితీలు ఇవ్వడం, ఉల్లంఘించే వారికి భారీ జరిమానాలు విధించడం వంటి 'ఫిస్కల్ ఇన్సెంటివ్స్' విధానాన్ని ప్రవేశపెట్టాలి. బలమైన రాజకీయ సంకల్పం లేకపోతే, మనం పీల్చే గాలిని చూస్తూ కూడా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలోనే ఉండిపోతాం.శ రాజధాని ఢిల్లీని వాయుకాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. మరోవైపు ప్రపంచానికే పొగమంచు రాజధానిగా పేరుపొందిన చైనా రాజధాని బీజింగ్ గడచిన దశాబ్ద కాలంలో వాయు నాణ్యతను గణనీయ స్థాయిలో మెరుగుపరుచుకుంది. గడచిన వారం రోజులుగా ఢిల్లీలో వాయు నాణ్యత దారుణంగా పడిపోయిన నేపథ్యంలో ఈ గండం నుంచి గట్టెక్కడానికి చైనీస్ ఎంబసీ ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేసింది. పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న దరిమిలా ఉత్పన్నమయ్యే వాయు కాలుష్యంపైన ఎలా పోరాడాలో భారత్, చైనాకు తెలుసునని చైనీస్ ఎంబసీ అధికార ప్రతినిధి యూ జింగ్ తన పోస్టులో పేర్కొన్నారు. స్వచ్ఛమైన గాలి రాత్రికి రాత్రే రాదని, కాని దాన్ని సాధించగలమని ఆమె తెలిపారు. ఢిల్లీలో వాయు ప్రమాణ సూచి(ఏక్యూ) 447 ఉండగా బీజింగ్‌లో 67 పాయింట్లు ఉంది. దశలో పారిశ్రామిక పునర్వ్యవస్థీకరణపై దృష్టి సారించాలని ఆమె తెలిపారు. బీజింగ్‌లో 3,000కు పైగా భారీ పరిశ్రమల మూసివేత లేక వేరే ప్రాంతాలకు తరలింపు జరిగినట్లు చెప్పారు. చైనాలోని అతి పెద్ద ఉక్కు తయారీ సంస్థల్లో ఒకటైన షౌగాంగ్‌ని వేరే చోటుకు తరలించడంతో 20 శాతం వాయు కాలుష్యం తగ్గినట్లు వివరించారు.

# ఆరోగ్యానికి చిన్నపరీక్ష!



జెస్టేషనల్ డయాబెటిస్.. మహిళల్లో గర్భధారణ సమయంలో కనిపిస్తుంది. చాలామందిలో ప్రసవం తర్వాత తగ్గిపోతుంది. కానీ, మూడింట ఒకవంతు మంది మహిళలు.. డెలివరీ తర్వాత కూడా షుగర్ వ్యాధితో బాధపడుతున్నారట. ఈ క్రమంలో కాన్పు తర్వాత 'గ్లూకోజ్ టాలరెన్స్ టెస్ట్' చేయించుకోవాలని ఆరోగ్య నిపుణులు సలహా ఇస్తున్నారు. కానీ, చాలామంది మహిళలు ఈ పరీక్షలు చేయించుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. ప్రసవం తర్వాత పిల్లల కోసమే పూర్తి సమయాన్ని కేటాయిస్తూ.. తమ ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదు. 'టాలరెన్స్ షుగర్ పరీక్ష'కు చాలామంది మహిళలు విముఖత చూపుతున్నారని తాజా పరిశోధన ఒకటి తేల్చింది. కెనడాకు చెందిన లునెన్‌ఫీల్డ్ – టానెన్‌బామ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ చేపట్టిన ఈ పరిశోధన వివరాలను 'డయాబెటిస్ కేర్' ప్రచురించింది. ఇందులో పేర్కొన్న వివరాల ప్రకారం.. 'గ్లూకోజ్ టాలరెన్స్' పరీక్ష చేయించుకోవాలంటే.. బాలింతలు రాత్రిపూట ఉపవాసం ఉండి, మరుసటి రోజు ఉదయం పరీక్షకు రావాల్సి ఉంటుంది. శాంపిల్ ఇచ్చిన తర్వాత.. ఆహారం తీసుకొని, మళ్లీ రెండు గంటలపాటు వేచి ఉండి, మరోసారి రక్తం శాంపిల్ ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో, ఎక్కువ సమయంపాటు వేచి చూడటం, రాత్రిపూట ఉపవాసం.. ఇలాంటి కారణాలతో మహిళలు ఈ పరీక్ష చేయించుకోవడానికి విముఖత చూపుతున్నారట. ఈ సమస్యను గుర్తించిన అంతర్జాతీయ డయాబెటిస్ సమాఖ్య.. ఈ పరీక్ష వ్యవధిని ఒక గంటకు తగ్గించాలని సిఫార్సు చేసింది. ఇలా, ఒక గంటలో పూర్తిచేసే పరీక్ష.. రక్తంలో చక్కెర స్థాయులను కచ్చితంగా అంచనా వేస్తుందని పరిశోధనలో తేలింది. ఇందులో భాగంగా.. 369 మంది మహిళలను ఎంపికచేసింది. వీరిలో కొందరికి ప్రసవానంతరం రెండు గంటల టాలరెన్స్ టెస్ట్ చేయగా.. మరికొందరికి గంటలో పూర్తయ్యే పరీక్ష నిర్వహించారు. ఆశ్చర్యకరంగా.. రెండు రకాల పరీక్షల ఫలితాలు సరిపోలినట్టు పరిశోధకులు వెల్లడించారు. ఈ చిన్న పరీక్షతో భవిష్యత్తులో షుగర్ వ్యాధి ముప్పు నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు.

# వృథం కాదు.. బలం!



చెత్తబుట్టలో పడేసే వంటింటి వ్యర్థాలు.. పెరటి మొక్కలకు బలాన్ని ఇస్తాయి. సహజసిద్ధమైన ఎరువుగా పనిచేసి.. మొక్కలు ఏపుగా పెరిగేందుకు సాయపడతాయి. మట్టిసారాన్ని పెంచడంతోపాటు రసాయనాల ముప్పునూ తగ్గిస్తాయి. మరి.. మొక్కల ఎదుగుదలను ప్రోత్సహించే ఆ పదార్థాలేంటో తెలుసుకుందామా!. %శ్రీ% ఆరోగ్యానికి మేలుచేసే గ్రీన్ టీ.. మొక్కల ఎదుగుదలలోనూ ముందుంటుంది. వేడినీటిలో ముంచి పక్కన పడేసిన 'గ్రీన్ టీ' బ్యాగుల్లోని తేయాకును ఒక గిన్నెలోకి తీసుకోవాలి. ఇది మొక్కలకు సహజ ఎరువుగా పనిచేస్తుంది. దీన్ని అలాగే మొక్కల మొదళ్లలో వేస్తే సరిపోతుంది. దీంతోపాటు ఒక లీటర్ నీటిలో కొన్ని గ్రీన్ టీ బ్యాగులు వేసి.. కొన్ని గంటల పాటు నాననివ్వాలి. ఆ తర్వాత టీ బ్యాగులను బాగా పిండేసి.. ఆ నీటిని మొక్కలపై పిచికారీ చేయాలి. ఇలా చేస్తే.. మొక్కలు మరింత ఏపుగా పెరుగుతాయి. మొక్కలను చీడపీడల నుంచి కాపాడటంలో ఉల్లిపొట్టు కీలకపాత్ర పోషిస్తుంది. బయట పడేసే ఉల్లిపొట్టును మొక్కల పొదల్లో వేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది. ఐదు లీటర్ల గోరు వెచ్చని నీటిలో 20 – 30 గ్రా. ఉల్లిపొట్టు వేసి.. నాలుగు రోజులపాటు పక్కన ఉంచాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని మొక్కలపై పిచికారీ చేస్తే.. మొక్కలకు బలం వస్తుంది. తొక్కే కదా!' అని పారేసే అరటి తొక్కలోనూ.. మొక్కలకు అవసరమయ్యే పోషకాలు ఎన్నో ఉంటాయి. అరటిపండు తొక్కల్ని మొక్కల మొదళ్ల వద్ద వేసి.. దానిమీద కొద్దిగా మట్టిని కప్పాలి. కొన్నిరోజులకు ఆ తొక్కలు మట్టిలో కలిసిపోయి.. ఎరువుగా మారుతాయి. ముఖ్యంగా, పూల మొక్కలు విరివిగా పూసేందుకు ఈ ఎరువు అద్భుతంగా పనిచేస్తుంది.

# వాల్ నట్స్‌ను రోజూ తింటే ఎన్ని పోషకాలు లభిస్తాయో తెలుసా..?



మన శరీరానికి పోషకాలను అందించే ఎన్నో రకాల ఆహారాలు మనకు అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా సరే తమ ఇష్టాలు, అభిరుచులకు అనుగుణంగా, తమ స్థోమతను బట్టి ఆయా ఆహారాలను తింటుంటారు. అయితే పోషకాల విషయానికి వస్తే మనకు నట్స్ ఎంతో దోహదం చేస్తాయని చెప్పవచ్చు. నట్స్‌లో వాల్ నట్స్ మనకు ఎక్కువ లాభాలను అందిస్తాయి. కానీ జీడిపప్పు, బాదంపప్పు అంటే చాలా మందికి ఇష్టంగా ఉంటుంది. వాల్ నట్స్ ను వాటి రుచి కారణంగా చాలా మంది తినరు. అయినప్పటికీ వీటిల్లోనే పోషకాలు అధికంగా ఉంటాయి. వాల్ నట్స్‌ను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వాల్ నట్స్‌ను రోజూ నానబెట్టి తినాలని వారు సూచిస్తున్నారు. వాల్ నట్స్‌లో మన శరీరానికి అవసరం అయ్యే అనేక పోషకాలు ఉంటాయి.

అధిక బరువు తగ్గుతారు..: వాల్ నట్స్‌లో ఆల్ఫా-లినోలీనిక్ యాసిడ్ (ఆలా) అనే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్ల ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. హార్ట్ ఎటాక్ రాకుండా చూస్తాయి. అలాగే మెదడు పనితీరును మెరుగు పరుస్తాయి. మెదడు యాక్టివ్‌గా పనిచేసేలా చేస్తాయి. వాల్ నట్స్‌లో ప్రోటీన్ల కూడా సమృద్ధిగానే ఉంటాయి. ఇవి శరీర కణజాలాన్ని పునర్నిర్మించేందుకు సహాయ పడతాయి. కణజాలం మరమ్మత్తులకు గురై ఆరోగ్యంగా ఉంటుంది. కణజాలం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ వాల్ నట్స్‌ను తీసుకోవాలి. వాల్ నట్స్‌లో ఫైబర్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. దీంతో బరువు కూడా నియంత్రణలో ఉంటుంది. అధిక బరువును సులభంగా తగ్గించుకోవచ్చు. కొవ్వు కరుగుతుంది. ముఖ్యంగా పొట్ట దగ్గర ఉన్న కొవ్వు తొలగిపోతుంది.

చర్మ సంరక్షణకు..: వాల్ నట్స్‌లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. వీటిల్లో విటమిన్ ఇ ఎక్కువగా ఉంటుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటుంది. అందువల్ల ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. దీంతో కణాలు డ్యామేజ్ అవకుండా ఆరోగ్యంగా ఉంటాయి. వాల్ నట్స్‌ను తింటే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. చర్మం కాంతివంతంగా మారి తేమగా ఉంటుంది. మృదువుగా మారుతుంది. ఎల్లప్పుడూ యవ్వనంగా కనిపిస్తారు. వృద్ధాప్య ఛాయలు దరిచేరవు. ముఖంపై ఉండే ముడతలు, మచ్చలు పోతాయి. వాల్ నట్స్‌లో ఫోలేట్ (విటమిన్ బి9) అధికంగా ఉంటుంది. ఇది డీఎన్ఏ ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. ఎర్ర రక్త కణాలు తయారయ్యేందుకు దోహదం చేస్తుంది. కనుక వాల్ నట్స్‌ను గర్భిణీలు తింటే శిశువులకు కూడా ఎంతో మేలు జరుగుతుంది. వారిలో పుట్టుక లోపం రాకుండా చూడవచ్చు.

కండరాల పనితీరుకు..: వాల్ నట్స్‌లో మెగ్నిషియం అధికంగా ఉంటుంది. ఇది కండరాల పనితీరును మెరుగు పరుస్తుంది. కండరాల నొప్పులను తగ్గిస్తుంది. నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. రాత్రి పూట కాలి పిక్కలు పట్టుకుపోయే సమస్య ఉన్నవారు రోజూ వాల్ నట్స్‌ను తింటుంటే ప్రయోజనం ఉంటుంది. అలాగే వాల్ నట్స్‌లో ఉండే మెగ్నిషియం ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తుంది. దీని వల్ల మైండ్ రిలాక్స్ అయి రాత్రి పూట చక్కగా నిద్ర పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. వాల్ నట్స్‌లో అధికంగా ఉండే ఫాస్ఫరస్ ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతుంది. వాల్ నట్స్‌ను రోజూ తినడం వల్ల వృద్ధాప్యంలో ఆస్టియోపోరోసిస్, ఆర్థరైటిస్ వంటి ఎముకల సంబంధిత సమస్యలు రాకుండా చూసుకోవచ్చు. ఇలా వాల్ నట్స్‌ను రోజూ తింటే అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# అందానికి ఆహారం



అందాన్ని కాపాడుకోవడం.. కొంచెం కష్టంగానే ఉంటుంది. ముఖ్యంగా చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే.. అదనపు జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తుంది. అయితే, బయటినుంచి ఎన్ని క్రీములు రాసినా, ఎంత మెరుగులు దిద్దినా మండే ఎండల్లో వ్యర్థమే అవుతుంది. సరైన ఆహారం తీసుకున్నప్పుడే.. వన్నె తగ్గని అందం సొంతమవుతుంది. ఈ క్రమంలో చర్మ సంరక్షణలో కొన్ని ముఖ్యమైన అంశాలను అందించే ఆహారాన్ని తీసుకోవాలని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. హైడ్రేషన్: వేసవిలో చర్మం హైడ్రేటెడ్‌గా ఉండాలంటే.. అవకాడో, పుచ్చకాయలు, దోసకాయలు, స్వీట్ పొటాటో, టమాటా, గ్రీన్ టీ.. తీసుకోవడం మంచిది. అవకాడోలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు, విటమిన్లు.. శరీరానికి మరింత శక్తినిస్తాయి. ఇందులోని యాంటి ఏజింగ్ లక్షణాలు.. చర్మం ముడతలు పడకుండా కాపాడతాయి. స్వీట్ పొటాటో.. నేచురల్ సన్‌బ్లాక్‌గా పనిచేస్తుంది. చర్మాన్ని కాంతిమంతంగా మారుస్తుంది. ఇందులో అధిక మొత్తంలో లభించే బీటా కెరోటిన్.. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పుచ్చకాయలు, దోసకాయలు అధిక శాతం నీటితో నిండి ఉంటాయి. ఇవి చర్మాన్ని హైడ్రేట్ చేయడంతోపాటు ఇన్‌ఫ్లమేషన్, చికాకును తగ్గిస్తాయి. వడదెబ్బ వల్ల కలిగే నొప్పిని నివారిస్తాయి. విటమిన్లు: వేసవిలో దెబ్బతిన్న చర్మం మళ్లీ మెరుగ్గా మారాలంటే.. ఆహారంలో విటమిన్లు అధికంగా ఉండేలా చూసుకోవాలి. కొలాజెన్ ఉత్పత్తి కోసం ఆహారంలో విటమిన్ సి ఉండాలి. నారింజ, నిమ్మకాయలు, ద్రాక్షపండ్లలో విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది. క్యారెట్లలో బీటా కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఇది చర్మంపై ముడతలు, గీతలు తగ్గించడంతోపాటు చర్మ ఆరోగ్యాన్ని కాపాడటంలో ముందుంటుంది. కేల్ ఆకుకూర.. వేసవిలో అనేక ప్రయోజనాలను అందిస్తుంది.

ఇందులోని విటమిన్ ఎ.. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీన్ని సలాడ్, సూప్‌లో తీసుకోవడం ద్వారా.. ఇందులోని విటమిన్లన్నిటినీ శరీరానికి అందించవచ్చు. ఇక గ్రీన్ టీలో ఉండే శక్తిమంతమైన ఫ్లేవనాయిడ్స్.. చర్మాన్ని ఫ్రీరాడికల్స్ నుంచి రక్షిస్తాయి. చర్మం ఎక్కువగా సాగకుండా నిరోధించడంతోపాటు ముడతలు పడకుండా చూస్తాయి. ఉల్లి వెల్లుల్లి కలిపి తింటే..వంటింట్లో ఉల్లి, వెల్లుల్లి తప్పనిసరిగా ఉంటాయి. దాదాపుగా అన్ని రకాల ఆహారాల్లో వీటిని వాడుతూ ఉంటారు.

# ఉల్లి, వెల్లుల్లి కలిపితింటే



ఏం జరుగుతుంది? ఏమైనా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయా? దీనికి నిపుణులు చెబుతున్న సమాధానాలు ఇవిగో%ా%రెండిట్లో పోషకాలు: ఉల్లి, వెల్లుల్లి కలిపి తినడం ఆరోగ్యానికి మంచిది. రెండిట్లోనూ యాంటి ఫంగల్, యాంటి బ్యాక్టీరియల్, యాంటి వైరల్ గుణాలు ఉంటాయి. కాబట్టి, వీటిని కలిపి తీసుకోవడం వల్ల మన రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. పదేపదే జబ్బు పడకుండా ఉంటాం. మైగ్రెయిన్ నుంచి ఉపశమనం: అధిక రక్తపోటు (హైపర్ టెన్షన్) ఉన్నవాళ్లు ఉల్లి, వెల్లుల్లిని కలిపి తినాలి. ఇలా చేస్తే కొంతకాలానికి ఈ సమస్య నుంచి విముక్తి లభిస్తుందంటున్నారు నిపుణులు. అంతేకాదు, పార్శపు నొప్పి (మైగ్రెయిన్)తో బాధపడుతున్న వారికి కూడా ఈ రెండు మంచి ఔషధాలుగా పనిచేస్తాయి. అయితే, ఇలా కలిపి తినడానికి ముందు డాక్టర్ సలహా తీసుకుని ఆచరించడం మంచిది. కొలెస్ట్రాల్‌కు బై బై: శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయులు పెరిగినప్పుడు కూడా ఉల్లి, వెల్లుల్లి కలిపి తినడం మంచిది. ఇవి కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుతాయి. శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా చేస్తాయి. ఉల్లి, వెల్లుల్లిలో విటమిన్ బి, సి, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి.

# తిప్పతీగ రసంలో పసుపు కలిపి తాగితే ఎన్ని లాభాలు ఉంటాయో తెలుసా..?





## అనేక వ్యాధులు నయమవుతాయి..!

ఆయుర్వేదంలో ఎన్నో రకాల మూలికలు, మొక్కలు మనకు అందుబాటులో ఉన్నాయి. కొన్ని రకాల మొక్కలు మన ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాల్లోనే పెరుగుతాయి. కానీ అలాంటి ఔషధ మొక్కల గురించి చాలా మందికి తెలియదు. వాటిల్లో తిప్పతీగ కూడా ఒకటి. తిప్ప తీగ కాండం లావుగా ఉంటుంది. దీన్ని చాలా సులభంగా గుర్తించవచ్చు. ఈ మొక్క తీగ జాతికి చెందినది.

మన ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాల్లోనే పెరుగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో తిప్పతీగ మనకు ఎక్కువగా కనిపిస్తుంది. తిప్ప తీగ ఆకుల నుంచి రసం తీసి తాగవచ్చు. ఈ రసంలో కాస్త పసుపు కలిపి తీసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేదం చెబుతోంది. తిప్పతీగ అనేక వ్యాధులను నయం చేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

రోగ నిరోధక వ్యవస్థకు..: తిప్పతీగ రసాన్ని ఒక టీస్పూన్ మోతాదులో తీసుకుని దాన్ని ఒక కప్పు నీటిలో కలపాలి. అందులోనే కాస్త పసుపు, మిరియాల పొడి, దాల్చినచెక్క పొడి వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని రోజూ ఉదయం పరగడుపున తాగాలి. ఈ పదార్థాలు కొందరిలో అలర్జీలను కలిగించవచ్చు. కనుక అలర్జీ సమస్య ఉన్నవారు ఈ మిశ్రమాన్ని తాగకూడదు. ఈ విధంగా తయారు చేసిన తిప్పతీగ మిశ్రమాన్ని తాగితే అనేక లాభాలు కలుగుతాయి. ఈ మిశ్రమాన్ని సేవించడం వల్ల అనేక ఔషధ గుణాలు లభిస్తాయి. అనేక రోగాలను తగ్గించుకోవచ్చు. దీంతో రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరిగి శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. ఎలాంటి రోగం అయినా సరే తగ్గిపోతుంది.

కీళ్లు, మోకాళ్ల నొప్పులకు..: తిప్పతీగ మిశ్రమంలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి శరీరంలోని వాపులు, నొప్పులను తగ్గిస్తాయి. దీంతో ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. కీళ్ల నొప్పులు, వాపుల సమస్యతో బాధపడుతున్నవారు రోజూ ఈ మిశ్రమాన్ని తాగితే ఫలితం ఉంటుంది. ఎముకలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే మోకాళ్ల నొప్పుల నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. ఈ మిశ్రమాన్ని సేవించడం వల్ల జీర్ణక్రియ మెరుగు పడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ముఖ్యంగా గ్యాస్, కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలు ఉండవు. అలాగే కడుపులో మంట నుంచి ఉపశమనం లభిస్తుంది. జీర్ణ సమస్యలు ఉన్నవారు ఈ మిశ్రమాన్ని సేవిస్తుంటే ఎంతో ఫలితం ఉంటుంది.

దయాబెటిస్ అదుపులో..: తిప్పతీగలో షుగర్‌ను తగ్గించే గుణాలు ఉంటాయి. అలాగే ఈ మిశ్రమంలో కలిపిన అన్ని పదార్థాలు కూడా షుగర్‌ను గణనీయంగా తగ్గిస్తాయి. కనుక డయాబెటిస్ ఉన్నవారు ఈ మిశ్రమాన్ని రోజూ సేవిస్తుంటే షుగర్‌ను కంట్రోల్ చేయవచ్చు. దీంతో డయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. తిప్పతీగ, పసుపులో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. కనుక ఈ మిశ్రమాన్ని సేవిస్తుంటే మొటిమలు, వాపులు తగ్గుతాయి. ముఖంపై ముడతలు, మచ్చలు తగ్గిపోతాయి. చర్మం కాంతివంతంగా మారుతుంది. యవ్వనంగా కనిపిస్తుంది. చర్మం మృదువుగా కూడా ఉంటుంది. ఈ మిశ్రమం ఆరోగ్యకరమైనదే అయినప్పటికీ మీరు ఏదైనా వ్యాధికి మందులను వాడుతుంటే ఆయుర్వేద వైద్యులను సంప్రదించి దీన్ని వాడడం ఉత్తమం. లేదంటే సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే అవకాశం ఉంటుంది.

# సోప్ నెయిల్స్ చూశారా?!



నో మేకప్ లుక్ ఇప్పుడు ట్రెండింగ్. ఇంతకు మునుపులా లేయర్లు లేయర్లు మేకప్ వేసుకుని హీరోయిన్‌లా కనిపించాలన్న ట్రెండు పోయి, హీరోయిన్లు కూడా మేకప్ లేకుండా కనిపించాలనుకునే రోజులు వచ్చాయి. మనిషి ఎంత నేచురల్‌గా కనిపిస్తే అంత అందం అన్నట్టు భావిస్తున్నారిప్పుడు. గోళ్ల విషయంలోనూ అచ్చం అదే పోకడ వచ్చింది. 'సోప్ నెయిల్స్' ఫ్యాషన్ మనకు ఆ విషయాన్నే చెబుతుంది. చూడగానే లేత గులాబీ రంగులో, తెల్లగా, ఆరోగ్యంగా, అప్పుడే మెనిక్యూర్ చేసిన గోళ్లలా శుభ్రంగా కనిపించడం వీటి ప్రత్యేకత. ఇందుకోసం లేత రంగుల్లో (న్యూడ్ షేడ్స్) ఉండే మ్యాటీ ఫినిష్ గోళ్ల రంగుల్ని ఎంచుకుంటున్నారు. పైన గాజులా కనిపించాలనుకుంటే గ్లాసీ ఫినిష్ కోట్‌కు ఓటు వేస్తున్నారు. కొంతమంది సబ్బు నురగల్ని పోలినట్టు లైట్‌గా కోట్‌ను వేస్తున్నారు. ఫేక్ నెయిల్స్ అదేనండీ ఆర్టిఫిషియల్ గోళ్లు పెట్టుకున్నా వాటిని ఇలాగే సింపుల్‌గా కనిపించేలా ముస్తాబు చేస్తున్నారు. ఫ్యాషన్ లేదా సింపుల్ లుక్ ఏదైనా అప్పుడే స్నానం చేసినట్టు శుభ్రంగా కనిపించే ఈ గోళ్లు చక్కగా సరిపోతాయి. ఆరోగ్యమే అసలైన అందం మరి అంటున్నాయన్న మాట ఈ ట్రెండింగ్ సోప్ నెయిల్స్!

# 'బరువెక్కుతున్న' భారత్



భారత్ ఊబకాయుల నిలయంగా మారుతున్నదని లాన్సెట్ నివేదిక హెచ్చరించింది. 2050 నాటికి దేశంలో 45 కోట్ల మంది ఊబకాయులు ఉంటారని అంచనా వేసింది. అదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా సగానికి పైగా వయోజనులు ఊబకాయం బారినపడతారని తేల్చింది. 2021లో చైనా తర్వాత భారత్‌లోనే స్థూలకాయులు ఎక్కువగా ఉన్నారని తెలిపింది. పిండి పదార్థాలు, తీపి పదార్థాలను తినడం తగ్గించి, ప్రొటీన్లను ఎక్కువగా తీసుకోకపోతే యువత, పిల్లలు స్థూలకాయం బారిన పడే ప్రమాదం మరింత పెరుగుతుందని హెచ్చరించింది.

# పత్తి కొనుగోలుకు సీసీఐ యాప్



అదిలాబాద్, : రైతులు పత్తి అమ్ముకోవాలంటే మధ్యవర్తుల దోపిడి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇలాంటివాటికి చెక్ పెట్టేందుకు సీసీఐ కొత్త యాప్ విధానం తీసుకొచ్చింది. 'కపాస్ కిసాన్' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ సీజన్ రైతులు పంట అమ్ముకునేదుకు తమ వివరాలు, పంట సాగుకు సంబంధించిన పూర్తి వివరాలు నమోదు చేసి స్లాట్ బుక్ చేయాలి.ఇలా చేయడం ద్వారా సెంటర్ల వద్ద రైతుల రద్దీని కంట్రోల్ చేయడమే కాకుండా.. అక్రమాలను అడ్డుకోవచ్చని సీసీఐ అనుకుంటోంది. కపాస్ కిసాన్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ తర్వాత రైతు పేరు, జండర్, డేట్ ఆఫ్ బర్త్, క్యాస్ట్, అడ్రస్, ఆధార్, మె?బైల్ నంబర్, అడ్రస్‌తో రిజిస్టర్ అవ్వాలి. అనంతరం ఏ మార్కెట్‌లో పత్తి అమ్మాలనుకుంటున్నారో ఆ వివరాలు ఎంటర్ చేయాలి.అంతేకాదు భూమి సొంతమా, కౌలుదారా చెప్పాలి. పట్టాదారు పాస్ బుక్ నెంబర్, సర్వే నెంబర్, కౌలత రకం, రైతుకు ఉన్న మె?త్తం భూమి, పత్తి సాగు విస్తీర్ణం, పంట రకం లాంటి వివరాలు ఇవ్వాలి. రైతు ఆధార్ కార్డు, పాస్‌బుక్, రైతు ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. వీటన్నింటితో కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేయాలి. మార్కెట్, తేదీ, టైమ్‌లోనే రైతుకు సంబంధించిన పత్తి కొనుగోళ్లను అనుమతి ఇస్తారు. సెంటర్ల వద్ద రైతులు వెయిట్ చేయాల్సిన పరిస్థతి తప్పుతుంది. స్మార్ట్‌ఫోన్, వ్యవసాయ అధికారుల వద్ద స్లాట్ బుక్ చేసుకోవచ్చు.పారదర్శకంగా పత్తి సేకరణ, మధ్యవర్తులను అరికట్టడానికి, రైతుల భాగస్వామ్యాన్ని క్రమబద్ధీకరించడానికి సీసీఐ కపాస్ కిసాన్ యాప్‌ను తీసుకొచ్చింది. గతంలో వ్యాపారులు రైతుల నుండి తక్కువ ధరలకు పత్తిని కొనుగోలు చేసి, తరువాత దానిని సీసీఐకి కనీస మద్దతు ధరకు విక్రయించారు. ఇప్పుడు కార్పొరేషన్ ఈ పద్ధతిని అరికట్టాలని యోచిస్తోందిమెదక్ జిల్లాలోని ఎంపిక చేసిన కొనుగోలు కేంద్రాలలో యాప్ ఆధారిత సేకరణను పైలట్ ప్రాతిపదికన ప్రవేశపెడుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఈ సంవత్సరం 4.93 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా 3.50 లక్షల ఎకరాలు సాగు చేశారు. సిద్దిపేటలో రైతులు 1.08 లక్షల ఎకరాల్లో, మెదక్‌లో కేవలం 35,000 ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు తెలుస్తోంది.

# ఆమె ధిక్కారం.. గొప్ప మార్పుకు ఆరంభం


అమ్మాయి 'వద్దు అందంటే వద్దనే' అర్థం.. అని కచ్చితంగా, కరాఖండిగా చెబుతున్న కాలం ఇది. కానీ, 19వ శతాబ్దంలో అమ్మాయి పరిస్థితి అలా లేదు. వివాహం ఆమె ఎంపిక కాదు. అది ఓ శాసనం. నిండా పదేళ్లు కూడా లేకుండా ఆడపిల్లకి పెళ్లి చేయడం అప్పుడు ఆనవాయితీ. సామాజిక కట్టుబాట్లకి లొంగిపోయిన ఎందరో ఆడపిల్లలు పట్టుమని ఇరవై ఏళ్లు కూడా నిండకుండా రెండు, మూడు గర్భస్రావాలతో, అరడజను మందికి పైగా పిల్లల తల్లులు. ఇంకా ఇలాంటి ఘోరాలు అప్పట్లో ఎన్నో.. ఆ పరిస్థితులని ధిక్కరించడం ఏ అమ్మాయి కలలో కూడా ఊహించని పరిణామం. కానీ, రుక్మాబాయి రౌత్ ఆ పనిచేసింది. బాల్యంలో తనకి జరిగిన వివాహాన్ని రద్దు చేయమని కోర్టుని ఆశ్రయించింది. 'జైలుకైనా వెళతా కాని భర్తతో కాపురానికి వెళ్లన'ని కరాఖండిగా చెప్పింది. ఈ సాహసం చేసినందుకు సమాజం ఆమెని ఎంతో అవమానించింది. అంతకుమించి నిందలు మోపింది. అయినా రుక్మా తన నిర్ణయాన్ని విడిచిపెట్టలేదు. పోరాడింది. సాధించింది. అలా భారత్‌లో తొలి విడాకులు తీసుకున్న మహిళగా చరిత్రల్లో తన పేరుని శాశ్వతంగా లిఖించుకుంది. ఆ రోజు ఆమె తీసుకున్న ఆ నిర్ణయం వెనుక తన ప్రయోజనం కంటే సమాజాన్ని బాగు చేయాలనుకున్న తపనే కనిపిస్తుంది. సెప్టెంబరు 25న ఆమె వర్ధంతి.

రుక్మాబాయి పుట్టేనాటికి ఆమె తల్లి వయసు 15 ఏళ్లు. 1864 జయంతి బాయి, జనార్ధన్ పాండురంగ్ దంపతులకు ఆమె జన్మించింది. రుక్మాకి రెండేళ్లు వచ్చేసరికి తండ్రి చనిపోయాడు. ఆమెకి 8 ఏళ్లప్పుడు తల్లి జయంతిని ప్రముఖ వైద్యుడూ, వృక్ష శాస్త్రవేత్త, సంఘసంస్కర్త అయిన డా. సఖరాం అర్జున్ రెండో వివాహం చేసుకున్నారు. వితంతు వివాహం ద్వారా గొప్ప మార్పుని స్వాగతించిన సఖరాం, జయంతి బిడ్డ అయిన రుక్మాని బాల్య వివాహం నుంచి తప్పించలేకపోయారు.

రుక్మాకి 11 ఏళ్లువచ్చేసరికి తనకంటే 8 ఏళ్లు పెద్దవాడైన దాదాజీ భికాజీతో వివాహం చేశారు. యుక్తవయసు వచ్చిన తరువాతే అత్తింటికి వెళ్లేలా ఒప్పందం పెట్టుకున్నారు. సవితి తండ్రి సఖరాం చొరవతో రుక్మా చదువులో రాణించింది. కానీ, భికాజీ చెడు సావాసాలకు అలవాటు పడ్డాడు. రజస్వల అయిన రుక్మాని కాపురానికి పంపమని ఒత్తిడి చేశాడు. కానీ రుక్మా ససేమిరా అంది. ఆ ధిక్కరణ అప్పట్లో పెద్ద విప్లవం. భర్త ఆజ్ఞాపిస్తే భార్య కాదనడం బరితెగించడం. ఈ ధోరణిని నిరసిస్తూ భికాజీ కోర్టు ద్వారా భార్యని లొంగదీసుకోవాలని చూశాడు. అయినా రుక్మా భయపడలేదు.

1885లో రుక్మా వర్సెస్ భికాజీ కేసు బొంబాయి హైకోర్టుకి వచ్చింది. ఆమె భర్తతో ఇంటికి వెళ్లాలని, లేనిపక్షంలో జైలు శిక్ష అనుభవించాలని తీర్పు వచ్చింది. అప్పుడు తాను 'జైలుకైనా వెళతా కానీ, భికాజీతో వెళ్లే ప్రసక్తి లేద'ని రుక్మా గట్టిగా నిలబడింది.

# సేంద్రీయ వ్యవసాయం చేస్తే మరో 4 వేలు అదనం



అదిలాబాద్, : రైతులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పెట్టుబడి సాయంగా వివిధ రకాల పథకాల ద్వారా డబ్బులను అందిస్తున్నాయి. అంతే కాకుండా.. పంట నష్టం జరిగితే పరిహారం.. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోతే.. బీమాను కల్పిస్తున్నారు. అయితే వ్యవసాయం పంటలకు చీడ పీడల నుంచి రక్షణకు ఎక్కువగా కెమికల్స్ ఉపయోగిస్తున్నారు. దీనివల్ల అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇలా కాకుండా.. రైతులను సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లించడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది.రైతులకు పెట్టుబడి సాయం, పంట నష్టానికి పరిహారం, బీమా వంటి పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. అయినప్పటికీ.. రైతులు పంటలను తెగుళ్లు, చీడపీడల నుంచి రక్షించుకోవడానికి ఎక్కువగా రసాయన ఎరువులను వాడుతున్నారు. ఈ రసాయనాల వల్ల నేల ఆరోగ్యం క్షీణించడమే కాకుండా, మానవ ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ సమస్యకు పరిష్కారంగా.. ప్రభుత్వాలు రైతులను సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లించేందుకు కృషి చేస్తున్నాయి. దీనిలో భాగంగా.. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ఎకరానికి రూ. 4,000 ఆర్థిక సహాయం అందిస్తున్నాయి. వీటితో పాటు.. తెలంగాణ రైతులకు రైతు భరోసా, రైతు బీమా? లాంటివి కూడా వర్తించనున్నాయి. ఈ పథకం గురించి పూర్తి వివరాలు ఇక్కడ తెలుసుకుందాం.కేంద్రం ప్రవేశపెట్టిన జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పథకాన్ని తెలంగాణలో జిల్లాల వారీగా అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఒక్కో జిల్లాలో క్లస్టర్లను ఏర్పాటు చేసి, ఒక్కో క్లస్టర్‌లో రెండు నుంచి మూడు గ్రామాలను ఎంపిక చేస్తున్నారు. ఒక్కో క్లస్టర్‌లో కనీసం 125 ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. రైతులకు సహాయం చేయడానికి, ఒక్కో క్లస్టర్ నుంచి ఇద్దరు రైతులను 'కృషి సఖీలు' లేదా 'క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్'గా ఎంపిక చేస్తున్నారు. వీరికి నెలకు రూ. 5,000 వేతనం ఇవ్వనున్నారు. వీరికి శిక్షణ ఇవ్వడానికి మాస్టర్ ట్రైనీలు ఉంటారు. ప్రకృతి వ్యవసాయం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ పథకం ద్వారా రసాయన ఎరువుల వాడకం తగ్గుతుంది, సాగు ఖర్చులు కూడా తగ్గుతాయి. రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం జాతీయ బ్రాండ్ కల్పించి, మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తుంది. జిల్లాల్లోని పరిశోధనా కేంద్రాలలో నమూనా క్షేత్రాలు ఏర్పాటు చేసి, రైతులకు ప్రత్యక్షంగా శిక్షణ ఇస్తారు. హన్మకొండ జిల్లాలో కూడా ఈ పథకం వేగవంతంగా అమలవుతోంది. జిల్లాలోని పలు గ్రామాలలో క్లస్టర్లను ఏర్పాటు చేసి, రైతులకు శిక్షణ ఇచ్చే ప్రక్రియ ప్రారంభమైంది.వ్యవసాయానికి అవసరమైన బయో ఎరువులు, జీవ రసాయనాలు అందుబాటులో ఉంచడానికి ప్రతి క్లస్టర్‌కు మూడు బయో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో కేంద్రానికి ప్రభుత్వం లక్ష రూపాయలు అందిస్తుంది. ఈ కేంద్రాలను రైతు సంఘాలు లేదా సహకార సంఘాలు నిర్వహించవచ్చు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 49 బయో కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# స్పీడ్ పోస్టు సర్వీస్‌లో పెను మార్పులు...

పోస్టాఫీసు స్పీడ్ పోస్టు సర్వీస్ లో పెను మార్పులు తీసుకొచ్చింది. సర్వీస్ ఛార్జీలను పెంచింది. డెలివరీ విధానంలో కూడా మార్పులు చేసింది. ఓటీపీ, ఎస్ఎంఎస్ ద్వారా డెలివరీ చేసేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోనుంది. ఈ మార్పులు అక్టోబర్ 1నుంచి అమలులోకి రానున్నాయి. పోస్టల్ డిపార్ట్ మెంట్ 1986లో స్పీడ్ పోస్ట్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. స్పీడ్ పోస్టు ద్వారా అందించే లెటర్లు, ఇతర సమాచారం పత్రాలును అందించడంలో కొత్త ఫీచర్లను ప్రవేశపెట్టినట్లు పోస్టల శాఖ ప్రకటించింది. ప్రైవేట్ కొరియర్ కంపెనీలకు ధీటుగా పోస్టల్ డిపార్ట్ మెంట్ తన సేవలను అందిస్తోంది. అందులో భాగంగా స్పీడ్ పోస్ట్ టారిఫ్‌లను చివరిసారిగా 2012 లో సవరించారు. తాజాగా పెరుగుతున్న ఖర్చులు, నిర్వహన భారం నుంచి వెసులుబాటు పొందేందుకు కొత్తగా సర్వీస్ ఛార్జీలను సవరించింది. స్పీడ్ పోస్ట్ (పత్రాలు/పార్శిల్‌లు) కోసం రిజిస్ట్రేషన్ అందుబాటులోకి తెచ్చారు. చిరునామాదారునికి లేదా వారి అధీకృత ప్రతినిధికి మాత్రమే డెలివరీ చేయనున్నారు. చిరునామాదారులు ఓటీపీని ధృవీకరించిన తర్వాత మాత్రమే స్పీడ్ పోస్టును డెలివరీ చేస్తారు. విద్యార్థులకు టారిఫ్‌పై10శాతం మినహాయి ంపు ఇవ్వనున్నారు. ఎస్ఎంఎస్ ద్వారా వినియోగదారులు డెలివరీ సంబంధిత సమాచారాన్ని చేరవేయనున్నారు. వినియోగదారులకు ఆన్‌లైన్ బుకింగ్ సౌకర్యం కూడా అందించనున్నారు. రియల్ టైమ్ డెలివరీ అప్‌డేట్‌ను కూడా తెలుసుకోవచ్చు.

**కొత్త టారిఫ్ రేట్లు.. :**పోస్టల్ శాఖ స్పీడ్ పోస్ట్ ఛార్జీలను సవరించింది. 1-50 గ్రాముల వరకు ఉన్నవస్తువులకు లోకల్ అయితేరూ.19, 2వేల కిలోమీటర్ల వరకు రూ.47చొప్పునా వసూలు చేస్తారు.51-250 గ్రాముల బరువున్న వస్తువులకు లోకల్ అయితే రూ.24. 200 కిలోమీటర్లకు వరకు రూ.59. 201-500 కిలోమీటర్ల వరకు రూ. 63. అలాగే 501-1000 కిలోమీటర్ల వరకు రూ.68. 1001-2 వేల కిలోమీటర్ల దూరం ఉంటే రూ.72 చొప్పునా చెల్లించాలి. 2వేల కిలోమీటర్ల పైన దూరం ఉంటే రూ.77 చొప్పునా చెల్లించాలి.

# సిటీలో వీధికుక్కలపై గ్రేటర్ అధికారుల దృష్టి




హైదరాబాద్: సుప్రీంకోర్టు తాజా ఆదేశాల మేరకు.. హైదరాబాద్‌లో వీధి కుక్కల బెడదను అరికట్టేందుకు జీహెచ్ఎంసీ ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించింది. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాలతో నగరంలోని ఆసుపత్రుల పరిసరాల వద్ద ఈ కార్యక్రమం మొదలైంది. తొలి రోజునే 277 కుక్కలను పట్టుకున్నారు. వీటికి స్టెరిలైజేషన్, టీకాలను ఇచ్చి.. జీహెచ్ఎంసీ సంరక్షణ కేంద్రాలకు తరలిస్తారు. ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలలు వంటి జనాలు ఎక్కుకవగా ఉండే ప్రాంతాల్లో ఈ డ్రైవ్‌ను కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగరంలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఇటీవల కుక్కల దాడులు పెరగడంతో.. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ చర్యలు సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండటం విశేషం. జీహెచ్ఎంసీ కమిషనర్ఆర్వీ కర్ణన్ ఆదేశాల మేరకు.. వెటర్నరీ విభాగం సిబ్బంది వీధి కుక్కలను పట్టుకునేందుకు ఒక ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించారు. ఈ డ్రైవ్‌ను ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాలపై ప్రధానంగా దృష్టి సారించి అమలు చేస్తున్నారు.ఈ ప్రత్యేక డ్రైవ్ ప్రారంభమైన తొలి రోజునే, నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల చుట్టు పక్కల ఏరియాల్లో ఏకంగా 277 వీధి కుక్కలను విజయవంతంగా పట్టుకున్నారు. ఆసుపత్రులలో రోగులు, సందర్శకులు ఎక్కువగా ఉంటారు కాబట్టి.. ఈ ప్రాంతాలకు ముఖ్య ప్రాధాన్యత ఇచ్చారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ అధికారులు మాట్లాడుతూ.. ప్రజల భద్రతను, ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ డ్రైవ్‌ను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆసుపత్రుల వద్ద కుక్కలు తిరగడం వల్ల పరిశుభ్రత లోపించడంతో పాటు.. రోగులకు ఇబ్బందులు తలెత్తుతాయనే ఉద్దేశంతో ఈ చర్యలు తీసుకున్నారు.పట్టుకున్న ఈ వీధి కుక్కలను కేవలం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించడం కాకుండా.. వాటి సంఖ్యను శాస్త్రీయ పద్ధతిలో నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పట్టుకున్న కుక్కలన్నింటికీ స్టెరిలైజేషన్ లేదా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు నిర్వహిస్తారు. ఈ పద్ధతిని యానిమల్ బర్త్ కంట్రోల్ కార్యక్రమం అని కూడా అంటారు. దీనివల్ల వాటి సంఖ్య పెరగకుండా నివారించవచ్చు. శస్త్రచికిత్స పూర్తయిన తర్వాత వాటిని జంతు సంరక్షణ కేంద్రాలకు తరలిస్తారు. తిరిగి.. వాటికి టీకాలు ఇచ్చి, కొద్ది రోజుల పర్యవేక్షణ తర్వాత మాత్రమే పట్టుకున్న ప్రాంతంలోనే సురక్షితంగా విడిచిపెడతారు. కమిషనర్ ఆర్వీ కర్ణన్ నగర ప్రజలకు భరోసా ఇస్తూ.. తొలి దశలో ఆసుపత్రులు, క్రీడా ప్రాంగణాలు, రవాణా కేంద్రాలపై దృష్టి సారించామని తెలిపారు. తదుపరి దశలో పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్‌లు వంటి ముఖ్యమైన పబ్లిక్ ప్రదేశాలు.. అలాగే పార్కులు, మార్కెట్ ప్రాంతాలలో కూడా ఈ డ్రైవ్‌ను కొనసాగిస్తామని ప్రకటించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా.. ఏబీసీ పద్ధతిని పకడ్బందీగా అమలు చేస్తూ.. హైదరాబాద్‌ను కుక్కల బెడద లేని నగరంగా మార్చేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# నిధులు విదల్చని కేంద్రం

- **ఇవ్వాల్సింది రూ.32,284 కోట్లు.. ఇచ్చింది రూ.4,014 కోట్లే**
- **కూటమిలో ఉన్నా రాష్ట్రానికి మొరడిచేయే**
- **అర్ధ వార్షిక లెక్కలతో ఆందోళన**



అమరావతి : ఎన్ఏ కూటమిలో భాగంగా ఉన్నప్పటికీ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్రం పట్ల చిన్నచూపు చూస్తూనే ఉంది. రాష్ట్రంలో డబుల్ ఇంకిస్ సర్కారు ఉందని చెబుతున్న మాటలకు ఆచరణకు పొంతన కనవడటం లేదు. కేంద్రం నుంచీ రాష్ట్రానికి రావా ల్సిన గ్రాంట్లలో భారీ ఎత్తున కోత పడటమే దీనికి తాజా నిదర్శనం. ఈ సంవత్సరవు వార్షిక బడ్జెట్ ప్రతిపాదనల్లో 32,284 కోట్ల రూపాయిలు గ్రాంట్లుగా కేంద్రం నుండి వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం చూపించింది. దాదాపు బర్ధ సంవత్సర కాలం ముగుస్తుందగా ఇప్పటి వర కు వచ్చింది కేవలం నాలుగు వేల కోట్ల రూపాయలు మాత్రమే కావడం గమనార్హం. అంచనా వేసిన మొత్తంలో నాల్గవ వంతు కూడా లేకపోవడం అధికార యంత్రాంగంలో చర్చనీయాంశంగా మారింది. ప్రధానంగా కేంద్రం ఇచ్చే గ్రాంట్లు కేంద్రం పన్నుల్లో వాటా నిధులే రాష్ట్రానికి కీలకంగా ఉంటాయి. ఈ నిధుల ఆధారంగానే అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. అయితే, ఆ నిధుల్లోనే భారీగా కోత పడుతుండటం అధికారులన ఆందోళనకు గురిచేస్తోంది. వారు చెబుతున్న లెక్కల ప్రకారం రావాల్సిన మొత్తంలో కేవలం 12 శాతం మాత్రమే ఇప్పటి వరకు కేంద్ర నిధులు రాష్ట్రానికి అందాయి. అరునెలల కాలానికి 50 శాతం నిధులు రావాల్సిఉందగా, 25 శాతం కూడా రాకపోవడం గమనార్హం. కే ంద్ర వనల్లో రాష్ట్ర వాటా కూడా ఇప్పటివరకు 42 శాతమే చేతికందింది. ఏడాది మొత్తానికి రూ.10,807 కోట్లు రావాల్సి ఉండగా, ఆర నెలల్లో రూ.17,187 కోట్లు మాత్రమే రావడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వంలో రాష్ట్రం కీలకంగా ఉన్నప్పటికీ రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు పట్టించుకోవడం లేదని, కేంద్రంపై వత్తిడి తేలేకపోతున్నారని విమర్శలు ఉన్నాయి. దీనిని అలుసుగా తీసుకుంటున్న కేంద్రం క నాదా నిధుల ఎగవేతకు పాల్బడుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మిగిలిన ఆదాయాన్ని చూసినా అన్ని రంగాల్లోనూ లక్ష్యాని కన్నా తక్కువగా నిధులు సమకూరాయి. పన్నేతర ఆదాయం కేవలం 13 శాతంగానే నమోదైంది.

ఆదాయ లోటు 140 శాతానికి చేరుకోవడం ఆందోళన కలిగిస్తోందని అధికారులు అంటున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పన్నులు గ్రాంట్లు ద్వారా రూ.2.17 లక్షల కోట్లు వస్తాయ ని అంచనా వేయగా, 74 వేల కోట్లు మాత్రమే వచ్చాయి. అంచనా మేరకు కేంద్రం నుండి నిధులు కారపోవరంలో రూ.63 వేల కోట్లు రుణం తీసుకోవాల్సివచ్చింది. ఫలితంగా ఐడ్జెట్లో రూ.79,926 కోట్లు రుణం తీసుకోవాలని ప్రతిపాదించగా, ఆరు నెలల్లోనే 78 శాతానిడి పైగా రుణం సేకరించాల్సి వచ్చింది. దీంతో మిగిలిన ఆరు నెలలకు తీసుకునేందుకు అవకాశం ఉన్న రుణం కేవలం రూ.17 వేల కో ట్ల వరకు మాత్రమే ఉన్నట్లు తేలింది. భారీగా ఆదాయ లోటు:

ఆదాయం కన్నా వ్యయం ఎక్కువగా ఉండడంతో లోటు కూడా అదే స్థాయిలోకి చేరుకుంటోంది. ఈ ఏడాది ఆదాయ లోటు రూ.33,185 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేయగా, తొలి ఆరు నెలలకే రూ.46,652 కోట్లకు లోటు చేరుకోవడం గమనార్హం. ద్రవ్య లోటు రూ డా రూ.79,926 కోట్లు ఉంటుందని అంచనా వేయగా,ఇప్పటికే రూ.62 వేల కోట్లు వరకు పెరిగిపోయింది.

# ఇక ఏఐ సాయంతో తిరుమల దర్శనం




తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనం కోసం కొండకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తిరుమల తిరుపతి దేవస్థానం చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే సాంకేతికత సాయంతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే ఆలోచనలు చేస్తోంది. అందులో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో శ్రీవారి భక్తులకు రెండు గంటల్లోగా దర్శనం కల్పించే ఆలోచనను టీటీడీ గతంలో చేసింది. అయితే దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావటంతో పాటుగా కొంతమంది నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. ఏఐ సాయంతో రెండు గంటల్లో శ్రీవారి దర్శనం గురించి విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రక్రియపై కాస్త వెనుకడుగు వేసిన టీటీడీ .. మరోసారి ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించే ఆలోచన చేస్తోంది. ఈ విషయాన్ని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. ఈ క్రమంలోనే ఏఐ సాయంతో తిరుమల శ్రీవారి దర్శనం గురించి టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ఏఐ ద్వారా రెండు గంటల్లో శ్రీవారి దర్శనం కల్పించాలనే ఆలోచన గతంలో చేసినట్లు బీఆర్ నాయుడు వివరించారు. అయితే ఓ వర్గం నుంచి వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. టీటీడీ నూతన ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ఆధ్వర్యంలో త్వరలోనే ఈ ఏఐ ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కిస్తామని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. తాము బాధ్యతలు చేపట్టిన తర్వాత తిరుమల అన్నప్రసాదాల్లో మార్పులు వచ్చాయని బీఆర్ నాయుడు చెప్పుకొచ్చారు.భక్తులకు రుచికరమైన భోజనం అందిస్తున్నామని.. లడ్డూ ప్రసాదంలోనూ చాలా మార్పులు చేశామన్నారు. ప్రస్తుతం లడ్డూ ప్రసాదాలు 10 రోజులైనా నిల్వ ఉంటున్నాయని భక్తుల నుంచ్ స్పందన వస్తోందన్నారు. తిరుపతివాసులు మూడు వేల మందికి ప్రతి నెలా మొదటి మంగళవారం శ్రీవారి దర్శన భాగ్యం కల్పిస్తున్నామని వివరించారు. తిరుమల కాటేజీలకు దేవుడి పేర్లు పెట్టాలని నిర్ణయించామని.. టీటీడీలోని అన్యమతస్తులను కూడా కొంతమందిని ఉద్యోగాల నుంచి తొలగించామన్నారు. తిరుమల శ్రీవారి బ్రేక్ దర్శనాల విషయంలోనూ మార్పులు చేశామని బీఆర్ నాయుడు వివరించారు. ఉదయం పదిన్నరకు ఉండే బ్రేక్ దర్శనాలను తెల్లవారు జాముకు మార్చామన్నారు. శ్రీవాణ ట్రస్టు కింద 5 వేల ఆలయాల నిర్మాణం, ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో గుడులు, భజన మందిరాలు నిర్మించనున్నట్లు తెలిపారు.మరోవైపు తిరుమల తరహాలో టీటీడీ ఆధ్వర్యంలోని ఆలయాల్లో నిత్యాన్నదానం అమలు చేయనున్నట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వివరించారు.

# గ్రేటర్ సిటీలుగా విజయవాడ, తిరుపతి



విజయవాడ, : ఏపీలో రెండు నగరాలు గ్రేటర్ సిటీలుగా మారనున్నా యి. విజయవాడ, తిరుపతిలకు గ్రేటర్ హోదా రానుంది. ఈ రెండు నగరాల్లో 138 పంచాయతీల విలీన ప్రతిపాదనల్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. గ్రేటర్ విశాఖపట్నంలో మరో 63 పంచాయతీలను చేర్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈమేరకు గ్రామాల విలీనానికి సంబంధించి అంశంపై ఫోకస్ పెట్టారు. త్వరలోనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తున్నారు.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో రెండు నగరాలను 'గ్రేటర్' హోదాకు మార్చబోతోంది. విజయవాడ, తిరుపతి నగరాల గ్రేటర్ ప్రతిపాదనలకు సంబంధించి మరో అప్డేట్ వచ్చింది. ఏపీ ప్రభుత్వం రెండు నగరాల విస్తీర్ణం పెంచేందుకు.. 10 మండలాల్లోని 138 గ్రామ పంచాయతీలను విలీనం చేసే అంశాన్ని పరిశీలిస్తోంది. గ్రేటర్ విశాఖపట్నం పరిధిలోకి మరో 64 పంచాయతీలను విలీనం చేసే ప్రతిపాదనల్ని పరిశీలిస్తున్నారు. రాష్ట్రంలో జనగణన పూర్తయ్యేలోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తున్నారు. వాస్తవానికి గ్రేటర్ నగరాల ప్రతిపాదనలపై ఇప్పటికే నిర్ణయం తీసుకోవాల్సింది కానీ జనగణన కారణంగా పక్కన పెట్టారు.విజయ వాడ గ్రేటర్ సిటీ ప్రతిపాదనలో భాగంగా ఆ? మండలాల్లో ఉన్న 75 పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనం చేయాలని 2014- 2019 మధ్య ప్రతిపాదనలు వచ్చాయి. కానీ గత ఐదేళ్లు ఈ ప్రతిపా దనల్ని పక్కన పెట్టారు. కూటమి ప్రభుత్వం తాజాగా ఈ ప్రతిపాదనల్ని మళ్లీ తెరపైకి తీసుకొచ్చింది. విజయవాడ గ్రేటర్ కార్పొరేషన్ ఏర్పాటైతే కేంద్రం నుంచి నిధులు కూడా వస్తాయి.. అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంటుంది.. అందుకే ఈ ప్రక్రియన వేగవంతం చేయను న్నారు. విజయవాడలోకి ఇప్పటికే చుట్టుపక్కల ఉన్న ఎన్నో గ్రామాలు, పట్టణాలు కలిసిపోయాయి.. కానీ మున్సిపాలిటీలు, గ్రామ పంచాయ తీల హోదాలోనే ఉన్నాయి. అందుకే అభివృద్ధికి అవకాశం లేకుండా పోయింది. అందుకే విలీన ప్రక్రియను పూర్తిచేసి విజయవాడను గ్రేటర్ కార్పొరేషన్‌గా మార్చాలని భావిస్తున్నారు.తిరుపతిని గ్రేటర్ కార్పొరేషన్‌గా ఏర్పాటు, గ్రామాల విలీనానికి సంబంధించి గతేడాది తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపారు. తిరుపతి రూరల్, రేణిగుంట, చంద్రగిరి మండలాల్లోని 64 గ్రామాలను గ్రేటర్ తిరుపతిలోకి విలీనం చేయాలని ప్రతిపాదించారు. ఇప్పటికే మంగళం, అవిలాలలు తిరుపతి నగరంలో కలిసిపోయాయి.. అవి పంచాయతీలుగా ఉండటంతో అభివృద్ధి పనులు నిలిపోయాయి. ప్రతిపాదించిన గ్రామాలతో పాటుగా నగరంలో కలిసిన ప్రాంతాలతో గ్రేటర్ తిరుపతి నగరపాలక సంస్థను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. విలీన ప్రక్రియపై త్వరలోనే క్లారిటీ వస్తుంది అంటున్నారు.గ్రేటర్ విశాఖపట్నంలోకి 64 గ్రామాలను విలీనం చేయాలని ప్రతిపాదించారు. ఈ గ్రామాలు ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి మండలాల్లో ఉన్నాయి. తాజాగా ప్రతిపాదించిన గ్రామాల్లో 60శాతం నగరంలో కలిసిపోయాయి. అందుకే ఈ పంచాయతీలను గ్రేటర్ పరిధిలోకి తీసుకుంటే మరింత అభివృద్ధి చెందుతాయని భావిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కూడా గ్రామాల విలీనం చాలా ముఖ్యమని చెబుతున్నారు. గతంలో అనకాపల్లి, భీమిలి, గాజువాక మున్సిపాలిటీలు గ్రేటర్ విశాఖపట్నంలో విలీనమైన తర్వాతే అభివృద్ధి చెందాయని చెబుతున్నారు. మొత్తం మీద విజయవాడ, తిరుపతి గ్రేటర్ సిటీలుగా మారబోతున్నాయి.. విటు గ్రేటర్ విశాఖపట్నంలో మరికొన్ని గ్రామాలు విలీనంకానున్నాయి

# దేశీయ తొలి ప్రైవేట్ రాకెట్..

## హైదరాబాదీ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ అరుదైన ఘనత




### వాణిజ్య ప్రయోగానికి స్కైరూట్ సిద్ధం

### భారత్‌లో ఇస్రో కాకుండా ఇతర సంస్థలకిదే మొదటిసారి

హైదరాబాద్,: దేశంలో అంతరిక్ష ప్రయోగాలకు కేరాఫ్ అడ్రస్ ఇస్రో. అయితే భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కున్న ఈ ఘనత ఇక ఎంతోకాలం కొనసాగకపోవచ్చు. అవును మరి. ఇస్రోను తక్కువ చేయడం కాదుగానీ.. హైదరాబాదీ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ ఓ వాణిజ్య రాకెట్ ప్రయోగానికి సిద్ధమవుతున్నది. భారత్‌లో ఈ తరహా తొలి ప్రైవేట్ రాకెట్ ఇదే కావడం విశేషం. హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్.. స్కైరూట్ ఏరోస్పేస్ ఓఅరుదైన ఘనతను సాధించబోతున్నది. దేశంలోనే మొదటిసారి సొంతంగా ఓ వాణిజ్య రాకెట్‌ను తయారుచేసి ప్రయోగించబోతున్నది. వచ్చే 3 నెలల్లో ఈ భారత తొలి ప్రైవేట్, కమర్షియల్ రాకెట్ గగనతలంలోకి దూసుకుపోవచ్చని చెప్తున్నారు. ప్రస్తుతం దేశీయంగా భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మాత్రమే ఈ తరహా ప్రయోగాలను చేస్తున్నది. అయితే ఇక స్కైరూట్ ఏరోస్పేస్ సైతం అందుకు వేదిక కాబోతుండటం గమనార్హం.

జనవరిలో..: ఇద్దరు మాజీ ఇస్రో శాస్త్రవేత్తల కంపెనీయే ఈ స్కైరూట్ ఏరోస్పేస్. వచ్చే ఏడాది జనవరిలో అంతరిక్షంలోకి తమ తొలి పూర్తిస్థాయి శాటిలైట్ మిషన్‌ను పంపాలని స్కైరూట్ ప్రయత్నిస్తున్నది. దీంతో భారతీయ అంతరిక్ష పరిశోధనా రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి పునాదులు పడ్డట్టేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, టీమ్‌సెక్, జీఐసీ వంటి ఇన్వెస్టర్లు ఈ ప్రాజెక్టు వెనుక ఉన్నారు. అయితే వచ్చే ఏడాది ప్రతీ 3 నెలలకోసారి ఒక ప్రయోగాన్ని చేపట్టాలని స్కైరూట్ యోచిస్తున్నది. ఈ క్రమంలోనే 2027కల్లా నెలకోసారి జరుపాలనుకుంటున్నామని చెప్తున్నది.

9 నెలలు.. 3 మిలియన్ డాలర్లు: ఒక్కో రాకెట్ నిర్మాణానికి దాదాపు 8-9 నెలల సమయం పడుతుందని, 2-3 మిలియన్ డాలర్ల ఖర్చు అవుతుందని స్కైరూట్ సీఈవో పవన్ చందన చెప్తున్నారు. దేశ, విదేశీ కస్టమర్ల పేలోడ్స్‌తో ఒక్కో ప్రయోగం ద్వారా సుమారు 5 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని అందుకోవచ్చనీ అంటున్నారు. ఇక ప్రపంచవ్యాప్తంగా చిన్నపాటి శాటిలైట్ల ప్రయోగాలకు డిమాండ్ పెరుగుతున్నదంటున్న స్కైరూట్.. తమ ప్రయోగాలతో ము న్ముందు భారత, అంతర్జాతీయ క్లయింట్లకు మరింత చౌకగా ఈ సేవలు అందుబాటులోకి వస్తాయన్న ఆశాభావాన్ని వెలిబుచ్చుతున్నది. 2018లో స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థను స్థాపించారు.

ఫండింగ్‌లో భాగంగా రూ.850 కోట్ల నిధులను ఈ కంపెనీ సమీకరించింది. 2022 నవంబర్‌లో తమ సబ్‌ఆర్బిటల్ వెహికిల్ విక్రమ్-ఎస్‌ను పరీక్షించడం ద్వారా ఓ రాకెట్‌ను లాంచ్ చేసిన తొలి ప్రైవేట్ భారతీయ సంస్థగా స్కైరూట్ గుర్తింపు పొందింది. ప్రస్తుతం ఇంజినీరింగ్, సరఫరాపరమైన సవాళ్లను ఎదుర్కొంటున్న ఈ సంస్థ.. 2028 మార్చి నాటికి లాభాల్లోకి అడుగుపెడుతామన్న ధీమాను కనబరుస్తున్నది. భారతీయ ప్రైవేట్ స్పేస్ ఇండస్ట్రీలో 200కుపైగా స్టార్టప్‌లు. 2033కల్లా ఈ రంగం విలువ 44 బిలియన్ డాలర్లకు చేరగలదని డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ అంచనా వేస్తున్నది.

# ఎంజీఎంలో ఏం జరుగుతోంది..?

వరంగల్: వైద్యులను ప్రాణదాతలు అని పిలుస్తుంటారు. కనిపించే దేవుళ్ళగా రోగులు కొలుస్తుంటారు. అటువంటి గొప్ప పేరు ఉన్న వైద్యులు రోగులకు చికిత్స అందించి.. ఇంకా మంచి పేరు తెచ్చుకోవాల్సి ఉండగా.. చికిత్సను పక్కనపెట్టి దోపిడికి పాల్పడుతున్నారు. అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడి ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల విభాగంలో అతిపెద్దదైన ఎంజీఎం లో అవినీతి వ్యవహారం తెరపైకి వచ్చింది. ఇటీవల ఈ ఆసుపత్రిలో ఒకటే ఆక్సిజన్ సిలిండర్‌ను ఇద్దరు చిన్నారులకు పెట్టడం చర్చకు దారి తీసింది. దీనిపై మీడియాలో ప్రముతంగా వార్తలు రావడంతో వైద్య శాఖ మంత్రి ఎంజీఎం పై చర్యలు తీసుకున్నట్టు వార్తలు వచ్చాయి. అయితే అందులో నిజం లేదని తర్వాత తేలింది.. ఇటీవల ఎంజీఎం లో రోగులపై సెక్యూరిటీ గార్డ్ లు దాడి చేశారు. ఆ దాడికి సంబంధించిన దృశ్యాలు కూడా మీడియాలో విపరీతంగా కనిపించాయి. ఈ ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించడం.. మీడియాలో ప్రముఖంగా రావడంతో ఎంజీఎం సూపరిండెండెంట్ పై చర్యలు తీసుకున్నది.ఈ సంఘటన తర్వాత ఎంజిఎం లో ఓ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఎంజీఎం లో అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల రెండు కోట్ల నిధులు పక్కదారి పట్టాయని ఆరోపణ వినిపిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ నిధులు స్వాహా కావడంతోపాటు టెండర్లు వేయకుండానే స్టేషనరీ కొనుగోలు చేసినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.

ఈ వ్యవహారం ఆస్పత్రి వర్గాలలో చర్చకు దారితీస్తోంది. ఎంజీఎం లో పనిచేస్తున్న ఉన్నతాధికారుల్లో ఒకరు ఈ అవినీతి వ్యవహారాన్ని మీడియాకు లిక్ చేసినట్టు తెలుస్తోంది. ఓవర్గం ఎంజీఎంలో ఇష్టాను సారంగా ప్రవర్తిస్తోందని.. పై అండలు చూసుకుని అడ్డగోలుగా దోపిడీ చేస్తోందని మరో వర్గం ఆరోపిస్తోంది. మరో వర్గానికి చెందిన

ఉన్నతాధికారి మీడియాకు లింకులు ఇవ్వడంతో ఈ వ్యవహారం బయటికి వచ్చింది. ఈ కుంభకోణంపై విజిలెన్స్ విచారణ చేపడితే నిజాలు బయట పడతాయని తెలుస్తోంది. ఎంజీఎం కొత్త బాస్ దీనిపై దృష్టి పెడితే బాగుంటుందని రోగులు అంటున్నారు.

# చెత్తను వేయకుండా సూపర్ ప్లాన్

విశాఖపట్టణం: ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయకుండా నివారించేందుకు గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త ఆలోచన చేసింది. స్థానికుల సహకారంతో దీనినిఅమలు చేస్తోంది. చెత్త వేసే ప్రదేశాలను శుభ్రపరిచి.. దేవుడి ఫోటోలు, మొక్కల కుండీలు, ముగ్గులు ఏర్పాటు చేస్తున్నారు. దీని ద్వారా ఆ ప్రదేశంలో మరోసారి చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని ప్రదేశాల్లో ఇది మంచి ఫలితాలు ఇవ్వటంతో త్వరలోనే విశాఖ నగరం మొత్తం అనుసరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.వీధుల్లో నడిచివెళ్లేటప్పుడూ.. కొన్నిసార్లు గోడలపై గమనించే ఉంటారు.. ఇక్కడ మూత్రం పోసిన వాడు గాడిద. ఇక్కడ చెత్త వేస్తే శిక్షార్హం.. అంటూ కొటేషన్లు, హెచ్చరిక బోర్డులు గమనించే ఉంటారు. ఎవరెన్ని కొటేషన్లు రాసినా.. అధికారులు ఎన్ని హెచ్చరికలు చేసినా కొంతమంది మాత్రం పద్ధతి మార్చుకోరు. పరిశుభ్రతతో పనిలేదు.. అధికారులహెచ్చరికలతో అస్సలు అవసరం లేదు..తమ పంథా తమదే..తమ పని తమదే. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు..చెత్త వేసే స్తూ ఉంటారు. ప్రభుత్వం ఇంటింటికీ చెత్త సేకరణ జరుపుతున్నా.. చెత్త కుండీలు ఏర్పాటు చేసినా క డా ఇలాంటి వారిలో మార్పులు ఆశించడం




అత్యాశే అవుతోంది. కాలనీలలోని ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు, చెత్తను పారబోస్తూ అపరిశుభ్ర వాతావరణానికి కారణమ వుతున్నారు. అలాంటి చోట్ల అధికారులు బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ ఇలాంటి వారిలో ఎలాంటి మార్పూ లేదు.దీంతో ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొ రేషన్ (జీవీఎంసీ) ఓ సరికొత్త ఆలోచన చేసింది. స్థానికుల సహకా రంతో ఈ వినూత్న కార్యక్రమాన్ని అమలు చేస్తూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తోంది.


## స్వచ్ఛమైన గాలి..ఆరోగ్యక జీవనం

## కాలుష్యం కట్టడితో సాధ్యం

### స్వచ్ఛాంధ్రలో కలెక్టర్ పిలుపు


విజయవాడ: స్వచ్ఛమైన గాలితో మనం ఆరోగ్యకరంగా జీవన ప్రయాణం కొనసాగించ వచ్చని.. ఆరోగ్య ఆంధ్ర దిశగా అడుగులు వేస్తూ కాలుష్య కట్టడికి సమష్టిగా కృషిచేద్దామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. క్టోబర్ నెల మూడో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా తిరువూరు మండల ం,లక్ష్మీపురం గ్రామంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లాకలె క్టర్ డా.జి.లక్ష్మీశ,శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరా వు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. మొక్కలు నాటిన అనంతరం స్థానిక రైతులకు కిలో రూ.10కేవర్మీ కంపోస్టును అందజేశారు. ప్రాంగణంలో ఏర్పాటుచేసిన అంగన్వా డీ, వైద్య ఆరోగ్యశాఖ, పీఎం సూర్యఘర్ స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర అ 2047 సాకారానికి ముందడుగుగా ప్రతిఒక్కరూ స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్రకు కృషిచేయాల్సిన అవసరముందని.. ప్రజారవాణా వ్యవస్థను ఉపయోగించడం, విస్తృతంగా మొక్కలు నాటడం, సౌర విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధన వనరులను వినియోగించడం, పరిశ్రమల్లో కాలుష్యాన్ని తగ్గించే విధానాలను అనుసరించడం, పంట అవశేషాల్ని కాల్చకుండా నివారించడం వంటివి పాటించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి నెలా మూడో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమా లను నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా ఈ రోజు క్లీన్ ఎయిర్ (స్వచ్ఛమైన గాలి) ఇతివృత్తంతో కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్లు వివరించారు.

# వైజాగ్ లో రహేజ పెట్టుబడులు





విశాఖపట్టణం,: విశాఖలో ఇదివరకే గూగుల్, టీసీఎస్ డేటా సెంటర్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టాయి. పలు కొత్త సంస్థలు, ఐటీ కంపెనీలు నగరానికి వస్తే త్వరలోనే విశాఖ రూపురేఖలో మారనున్నాయి. ఈ క్రమంలో ప్రముఖ నిర్మాణ సంస్థ కె.రహేజా కార్పొరేషన్ విశాఖలో ఇన్వెస్ట్ చేయడానికి నిర్ణయం తీసుకుంది. విశాఖలో త్వరలో ఏర్పాటుకానున్న డేటా సెంటర్లు, ఐటీ సంస్థలకు అవసరమైన వాణిజ్య, నివాస భవనాల సముదాయాలు నిర్మించేందుకు రహేజా సంస్థ పెట్టుబడులు పెట్టనుంది. దీని ద్వారా దాదాపు 28.65 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ అందుబాటులోకి వస్తుందిఈ ప్రాజెక్టు విశాఖలో ఐటీ రంగం అభివృద్ధికి, ఉత్పాదకత పెరుగుదలకు, అలాగే ఉద్యోగ అవకాశాలు సృష్టించడానికి వీలుంటుంది. ఈ ప్రాజెక్టు కోసం సంస్థ రూ.2,172.26 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. మధురవాడ ఐటీ హిల్ నంబరు-3లో 27.10 ఎకరాలు భూమిని ప్రాజెక్టు కోసం కేటాయించాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 9,681 మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయని రహేజా సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి చేసిన ప్రతిపాదనలో పేర్కొంది.విశాఖలో గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఏఐ ఆధారిత డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ఇటీవల ఢిల్లీలో సంస్థ ప్రతినిధులతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. గూగుల్ సంస్థ ఏపీలో ఏకంగా 1.33 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేస్తుంది.



# ఇన్‌కమింగ్ కాల్స్‌లో పేరు డిస్‌ప్లే

## త్వరలో ప్రవేశపెట్టనున్న ట్రాయ్

న్యూఢిల్లీ, : మన మొబైల్‌కు ఎవరు ఫోన్ చేస్తున్నారో తెలుసుకోవాలంటే ట్రూ కాలర్ లాంటి థర్డ్ పార్టీ యాప్‌లపై ఆధారపడుతున్నాం. ఇకపై అలాంటి అవసరం లేకుండా, ఫోన్ కనెక్షన్ సమయంలో ఇచ్చిన ఐడీలోని పేరు ఇన్‌కమింగ్ కాల్స్ సమయంలో మొబైల్ స్క్రీన్‌పై కనిపించే సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఈ మేరకు టెలికమ్యూ నికేషన్స్ శాఖ అందించిన ప్రతిపాదనలను టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) ఆమోదం తెలిపింది. వచ్చే ఏడాది మార్చి నాటికి ఇది అందుబాటులోకి రానుంది. కాలింగ్ నేమ్ ప్రెజెం టేషన్ (సీఎన్‌ఏపీ)గా పేర్కొనే ఈ సర్వీస్ ద్వారా ఇకపై వినియోగ దారులు తమకు వచ్చే కాల్స్‌లో పారదర్శకత పొందుతారు. మనకు కాల్ చేసే వ్యక్తి ఆయా టెలికం ఆపరేటర్ వద్ద ఏ పేరుతో అయితే సిమ్ తీసుకున్నాడో ఆ పేరు మాత్రమే మనకు డిస్‌ప్లే అవుతుంది. దీని ద్వారా స్పామ్ కాల్స్ బెడద తప్పుతుంది. సీబీఐ, ఐటీ, పోలీస్, సీఐడీ వంటి పేర్లతో మోసపుచ్చే అవకాశం ఉండదు. వినియోగ దారులకు ఈ ఫీచర్ డిఫాల్ట్‌గా ప్రారంభమవుతుంది.

# అమెరికాకు భారీగా తగ్గిన భారత విద్యార్థులు..

## రెండేండ్లలో 63 శాతం తగ్గుదల...



న్యూఢిల్లీ: భారతీయ విద్యార్థులకు అమెరికా విద్యపై మోజు తగ్గుతున్నది. వీసా నిబంధనలు, పెరిగిన వ్యయం, తగ్గిన ఉపాధి అవకాశాల నేపథ్యంలో భారత విద్యార్థులు అమెరికా యూనివర్సిటీలకు బదులుగా యూరప్‌వైపు తమ దృష్టి మరల్చారు. గత రెండేండ్లలో ఉన్నత విద్య కోసం అమెరికాను ఎంచుకొనే భారత విద్యార్థుల సంఖ్య 63% తగ్గినట్టు విద్యారుణాలు అందించే జ్ఞాన్‌ధన్ సంస్థ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. విదేశాల్లో చదువుకోవాలనుకొనే భారత విద్యార్థుల్లో అమెరికాను ఎంచుకొనే వారు 2023లో 54% మంది ఉండగా అది 2025 నాటికి 20 శాతానికి పడిపోయినట్టు ఆ వివరాలు తెలుపుతున్నాయి. అమెరికాలో ఇటీవల అమలులోకి వచ్చిన కఠిన వీసా నిబంధనలు, పెరిగిన ఖర్చులు, విద్యానంతరం ఉపాధి అవకాశాలకు గ్యారెంటీ లేకపోవడం వంటి అంశాలు విద్యార్థులను యూరప్ వైపు మరలుస్తున్నాయని జ్ఞాన్‌ధన్ సీఈవో అంకిత్ మెహ్రా పేర్కొన్నారు. హెచ్-1బీ వీసా ఫీజు పెంపుదల, ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రెయినింగ్ (ఓపీటీ) సమీక్షలు వంటి అంశాలు విద్యార్థులను ప్రత్యామ్నాయాలవైపు దృష్టి సారించేలా చేశాయని తెలిపారు. ఎక్కువ మంది భారత విద్యార్థులు యూరప్‌లోని జర్మనీ, ఐర్లాండ్,ఫ్రాన్స్ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు.

తమ వద్ద ట్యూషన్ ఫీజులు తక్కువని, విద్య అనంతరం ఉపాధి విధానాలను సరళీకరించామని చెప్తూ జర్మనీ విదేశీ విద్యార్థులను ఆకర్షిస్తున్నది. 4%నుంచి 2025 నాటికి 9 శాతానికి పెరిగిం ది. విదేశాల్లో చదువుకోవాలనుకొనే భారత విద్యార్థుల్లో 39% మందిబ్రిటన్‌ను ఎంచుకొంటుండగా ఈ ఏడాది వారి సంఖ్య 143 శాతం పెరిగింది. మరోవైపు కెనడా వైపు వెళ్లే వారి సంఖ్య సైతం 11% నుంచి 2.33 శాతానికి తగ్గిపోగా ఆస్ట్రేలియాను ఎంచుకొనే వారి సంఖ్య స్థిరంగా 7% వద్ద ఉన్నది.

# అపార్ట్ మెంట్ వద్దనుకుంటున్నారోచ్

హైదరాబాద్:కాస్త దూరంగా పోయి అయినా ఇండిపెండెంట్ ఇళ్లే కొనాలనుకునేవారు చాలా మంది ఉన్నారు. అలాంటి వారి కోసం హయత్ నగర్ హాట్ ఫేవరేట్ గా మారింది. చిన్న బిల్డర్లు 100 చదరపు గజం నుంచి 300చదరపు గజాల వరకు ఇళ్లను నిర్మిస్తున్నారు, ధరలు 45 లక్షలనుంచి 1కోటి వరకు చెబుతున్నారు. హయత్‌న గర్‌చుట్టూ రెసిడెన్షియల్ ప్లాట్లు ఇంకా అందుబాటులో ధరల్లోనే ఉన్నాయి, ముఖ్యంగా ఔటర్ రింగ్ రోడ్ సమీపంలో చదరపు గజానికి ?35,000 నుంచి-50,000 వరకు. పెద్ద అంబర్‌పేట్‌లో -32, 000 నుంచి -54,000 వరకు, పసుమాముల , తట్టి అన్నారంలో ?42,000 నుంచి -60,000 వరకు ధరలు ఉన్నట్లుగా రియల్ ఎస్టేట్ బ్రోకర్లు చెబుతున్నారు.

హయత్‌నగర్ సమీపంలో భూమి ధరలు ఇతర ప్రాంతాలతో పోలిస్తే తక్కువగా ఉన్నాయి. ఔటర్ రింగ్ రోడ్ సమీపంలో ఎకరానికి-3-4.5 కోట్లు, కొంచెం లోపల ?2-3 కోట్లు. రియల్ ఎస్టేట్ నిపుణులు, రీజియనల్ రింగ్ రోడ్ మరియు రింగ్ రైల్ వంటి అవసర సదుపాయాలు మొదలైన తర్వాత భూమి మరియు రెసిడెన్షియల్ ప్లాట్ ధరలు గణనీయంగా పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. అపార్టుమెంట్లు కూడా విరివిగా నిర్మిస్తున్నారు. చదరపు అడుగుకు -3,400 నుంచి -4,200 వరకు. డబుల్ బెడ్‌రూ మ్ ఫ్లాట్:-45లక్షల నుంచి -52 లక్షలు. ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్: 55 లక్షల నుంచి -65 లక్షలు.

# ప్రజాసేవే పరమార్థమైన మహా దాత..!



చింతలపాటి సీతా రామచంద్ర వరప్రసాద మూర్తిరాజు ప్రముఖ గాంధేయవాది. స్వాతంత్ర్య సమరయోధులు. వందలాది ఎకరాలు దానం చేసిన దాత...సర్వోదయ ఉద్యమానికి చేయూత...ఆరు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక...ఆక్వా పరిశ్రమకు ఆద్యుడు.. విద్యాదాత, అభినవ భోజుడు, గాంధేయవాది, సర్వోదయ నాయకుడు. పశ్చిమ గోదావరి జిల్లా రాజకీయ ప్రముఖుడు. ఆయన కొల్లేరు రాజుగా గుర్తింపు పొందారు.చిన్ననాటనే రాజకీయాల్లో ప్రవేశించి ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక య్యారు. 1952 నుంచి 1982 వరకు తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, పెంటపాడు నియో జకవర్గాల నుంచి పోటీ చేసి గెలు పొందారు. పీవీ నరసింహారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మార్కెటింగు, గిడ్డంగులు, దేవాదాయ శాఖ మంత్రిగా పని చేశారు. ప్రోటెం స్పీకరుగా కూడా పనిచేశారు.మూర్తిరాజు తణుకు తాలూకా సత్యవాడలో 1919వ సంవత్సరం డిసెంబరు 16వ తేదీన . బాపిరాజు, సూరాయమ్మ దంపతులకు జన్మిం చారు. మగపిల్లలు పుట్టలేదని శ్రీరాముడిని వేడుకుంటూ భద్రా చలం శ్రీరాముని దర్శించారు.. భక్తి ప్రపత్తుల ఫలితంగా పుట్టినందున ఈయనకు సీతారామచంద్ర వర ప్రసాద మూర్తిరాజు అని నామ కరణం చేశారు. మూర్తిరాజుగారి బాల్యం కొంతమేర సత్యవాడలోనే గడిచింది. తరువాత నారాయణ పురంలో ఉండేవారు. ఇంటికి సమీపంలో గోదావరి ఏలూరు కాలువ పక్కనే పాకలు వేయించి, వాటిలో వివేకా నంద మాధ్యమిక పాఠశాలను బాపిరాజు తమ స్వంత యాజమాన్యంలో నిర్వహించేవారు. మూర్తిరాజు ఆ పాఠశాలలోనే మాధ్యమిక విద్య పూర్తిచేసారు. ఎనిమిదవ తరగతి వరకు అక్కడే చదివారు. మిడిల్ స్కూల్లో పిల్లలు ఎవరూ చేరలేదు. ఊరూరు తిరిగి,పాఠశాలను నిలబెట్టడానికి బాపిరాజు చాలా శ్రమించారు. ప్రభుత్వ అనుమతిని కూడా తెప్పించారు. అందునిమిత్తం 40ఎకరాల భూమిని హామీ ఇవ్వ వలసి వచ్చింది. స్కూల్ లో లక్ష్మీపతి ప్రధానోపాధ్యాయులుగా, నరసింహాచార్యుల మంచి టీచర్లుగా ఉండేవారు. పాఠాలతోపాటు అనేక విషయాలు చెప్పేవారు. గాంధీ గురించి, ఆయన సిద్ధంతాల గురించి హృదయానికి హత్తుకునేలా చెప్పేవారు. వాస్తవానికి వారివల్ల దేశభక్తి అంటే ఏమిటో, ప్రజాసేవ అంటే ఏమిటొ మూర్తిరాజుకి తెలిసింది. మూర్తిరాజు తన జీవితమంతా ప్రజాసేవకే అంకితం చేశారు. చిన్నతనంలోనే మహాత్మాగాంధీ ప్రభావం ఆయనపై పడి, చివరి వరకు నిజమైన గాంధేయవాదిగానే ఉన్నారు. మహాత్మాగాంధీ దేశ పర్యటనలో భాగంగా 1929లో జిల్లాకు వచ్చినప్పుడు చేబ్రోలు రైల్వేస్టేషనులో ఆయనను చూశారు. అప్పటి నుంచి గాంధీ మార్గంలోనే నడిచారు. గాంధేయ వాదిగా ముద్ర వేసుకొని సత్యం, అహింస, స్వదేశీ విధానాలను తాను ఆచరించడమే కాకుండా జిల్లా వ్యాప్తంగా వాటికి విశేష ప్రచారం కల్పించారు. మాంసా హారానికి దూరంగా ఉన్నారు. చిన్నతనం నుంచే ఖద్దరు వస్త్రాలను ధరించడం మొదలు పెట్టారు.

అనేక మంది రాజకీయనాయకుల సభలకు హాజరయ్యేవారు. బాబూ రాజేంద్రప్రసాద్, జయప్రకాశ్ నారాయణ తణుకు వచ్చినపుడు, టౌన్ హాల్ లో బహిరంగ సభలు జరిగాయి. వారి ఉపన్యాసాలు మూర్తిరాజుని ఎంతగానో ఆకట్టుకోగా స్నేగితులలో కలిసి విద్యార్థి కాంగ్రెస్ ను ఏర్పాటు చేసారు. ఆయనను అధ్యక్షుడుగా ఉండమన్నారు. కార్యదర్శికి బాధ్యత ఎక్కువ కాబట్టి కార్యదర్శి పదవిని ఎంచుకున్నారు. ముళ్ళపూడి హరిశ్చంద్రప్రసాద్ ను అధ్యక్షుడుగా చేశారు. విద్యార్థి కాంగ్రెస్ లోని వారంతా ఒకే తరగతిలోని విద్యార్థులు.

కొవ్వలి గోపాలరావు, పుసులూరి కోదండ రామయ్య (ప్లీడరు), పొతాప్రగడ శ్రీరామారావు (ప్లీడదు), ముదిగంటి జగ్గన్నా శాస్త్రి మొదలైన నాయకులు తణుకు లోని కోమల విలాస్ దగ్గర గాంధీ బొమ్మ వద్ద సభలు జరిపేవారు. మూర్తిరాజు,

స్నేహితులు కలసి సమావేశాలు ఏర్పాట్లు చేసేవారు. మూర్తిరాజు తణుకులో 1934 నుండి 1939 వరకు విద్యాభ్యాసం చేసారు. 1939 మార్చి నెలలో స్కూలు ఫైనల్ పరీక్ష జరగగా, అందులో ఫెయిలయ్యారు. దానితో చదువు మాని స్వగ్రామానికి తిరిగివెళ్ళారు. ఆతర్వాత చదువు కొనసాగిం చడానికి ప్రయత్నించలేదు.

తన పక్క గ్రామమైన పెదనింద్ర కొలనులో పార్లమెంటు నమూనాలో గాంధీభవనం నిర్మించి ప్రజల స్మృతి పథం నుంచి మహాత్ముని చెరిగి పోకుండా చేశారు. సర్వోదయ ఉద్యమానికి ఊపిరులూదారు. 1955లో వినోభాబావే భూదానో ద్యమంలో భాగంగా జిల్లాకు వచ్చినప్పుడు 100 ఎకరాల భూమిని దానం చేశారు. .

1961లో ఉంగుటూరు మండలం నాచు గుంటలో అఖిల భారత సర్వోదయ సమ్మేళనం నిర్వహంచారు. విద్యా రంగంపై తిరుగులేని ముద్ర: విద్యా రంగంలో మూర్తిరాజు తనదైన ముద్ర వేశారు. భీమవరం, ఏలూరు నగరాలకే పరిమితమైన విద్యను గ్రామీణ ప్రాంతాలకు తీసుకొచ్చిన ఘనత ఆయనదే. తాను ఎస్ఎస్ ఎల్సీ వరకు చదివినా చదువు విలువ గుర్తించి ప్రతి ఒక్కరూ విద్యావంతులను చేయాలనే తపన పడేవారు. బాపిరాజు ధర్మసంస్థ ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థలు ఏర్పాటు చేశారు.

ఆక్వా పరిశ్రమకు ఆద్యుడు.. విద్యాదాత, అభినవ భోజుడు, గాంధేయవాది, సర్వోదయ నాయకుడు. పశ్చిమ గోదావరి జిల్లా రాజకీయ ప్రముఖుడు. ఆయన కొల్లేరు రాజుగా గుర్తింపు పొందారు.చిన్ననాటనే రాజకీయాల్లో ప్రవేశించి ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక య్యారు. 1952 నుంచి 1982 వరకు తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, పెంటపాడు నియో జకవర్గాల నుంచి పోటీ చేసి గెలు పొందారు. పీవీ నరసింహారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మార్కెటింగు, గిడ్డంగులు, దేవాదాయ శాఖ మంత్రిగా పని చేశారు. ప్రోటెం స్పీకరుగా కూడా పనిచేశారు.మూర్తిరాజు తణుకు తాలూకా సత్యవాడలో 1919వ సంవత్సరం డిసెంబరు 16వ తేదీన . బాపిరాజు, సూరాయమ్మ దంపతులకు జన్మిం చారు. మగపిల్లలు పుట్టలేదని శ్రీరాముడిని వేడుకుంటూ భద్రా చలం శ్రీరాముని దర్శించారు..

# అక్రమార్జనపై ఉద్యోగుల మక్కువ



హైదరాబాద్, : ప్రభుత్వ శాఖల్లో అవినీతి వేళ్లానుకుంది. రెవెన్యూశాఖలో పాసుపుస్తకాలు మొదలుకొని ఇతర అన్ని సేవలకు ఉద్యోగులు, అధికారులు లంచం తీసుకుంటున్నారని ఎంతోమంది బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇటీవలి కాలంలో తెలంగాణ లో దాడులు పెరిగాయి. ఫిర్యాదు రావడమే ఆలస్యం ..ఎసిబి స్పందించి వలపన్నుతోంది. ఎందరో చిక్కుతున్నారు. మరెందరో తప్పించుకుంటు న్నారు. ప్రజల పన్నులతో జీతాలు పొందుతున్న ఉద్యోగులు ప్రజలకు పనులు చేసి పెట్టకుండా లంచాలు మేస్తున్నారు. రెరా అధికారి బాలకృష్ణ మొదలు అనేకమంది పట్టుబడ్డారు. నీటిపారుదల శాఖలో తిమింగలాలు పట్టుబడ్డాయి. వందలకోట్లు అప్పనంగా సంపాదించినా నాయకులు, ఉద్యోగులు అక్రమాస్తులపై మక్కువ వదలడంలేదు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలో ఎక్కడ చూసినా ఎసిబి కేసులు నిత్యం నమోదవుతూనే ఉన్నాయి. రాజకీయ నాయ కులు, అధికారులు బినామీల పేరుతో ఆస్తులు కూడగడుతున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు ఈ విషయాలను పెద్దగా పట్టించుకోక పోవడం గమనార్హం. రాజకీయ నాయకులు కూడా ఆస్తుల వివరాలు ప్రకటించాల్సి ఉన్నా కొందరు మాత్రమే వెల్లడిస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ నాయకులు వారితోపాటు వారి కుటుంబసభ్యుల ఆస్తుల వివరాలు నామినేషన్ సమయంలో అఫిడవిట్లో వివరించాల్సి ఉంటుంది. పలు పార్టీల్లో ఉన్న కొందరు రాజకీయ నేతలు ప్రజాప్ర తినిధులు ఎన్నికైన తర్వాత అక్రమార్జనతో కోట్లకు పడుగలెత్తారు. గుత్తేదారుల నుంచి పర్సెంటేజీలు మొదలుకొని ప్రభుత్వ, ఆస్తులను ఆక్రమించుకొనే వరకు మరీ అక్రమ సంపాదనకు తెగబడుతున్నారు. సబ్రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతి రిజిస్ట్రేషన్కు మామూళ్లు వసూలు చేస్తున్నారని విమర్శలు లేకపోలేదు. ఇది నిజమని తెలిసినా వారిని ఎవరూ అడ్డుకోవడం లేదు.

నిషేధిత ఆస్తులు సైతం అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి కొందరు కోట్లు సంపాదించిన ఉదంతాలు ఉన్నాయి. ఈ శాఖలో ఉద్యోగుల బదిలీల్లోనూ అక్రమాలకు పాల్పడిన ఉదంతం మనకు తెలిసిందే. నీటిపారుదలశాఖ, రోడ్లు భవనాలశాఖ, పంచాయతీరాజ్శాఖ, నగరపాలకసంస్థ, పురపాలకలు, విద్యుత్శాఖ పరిధిలో జరిగే ప్రతి పనుల్లో అధికారులు, ఉన్నతాధికారులు, నేతలకు పర్సెంటీజీలు అందుతాయనేది బహిరంగ రహస్యమే. పోలీసుశాఖలో నెలసరి మద్యం మామూళ్లు, కేసుల వ్యవహారాల్లో వసూళ్ల దందా మామూలై పోయిందని బాధితులు వాపోతున్నారు. ఇలా ప్రతిశాఖలోనూ అవినీతి, అక్రమాల పలు పంథాల్లో కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు, ఉన్నతాధికారులు కోట్లకు కోట్లు సంపాదిస్తున్నారు. అక్రమాస్తులు కూడగడితే శిక్ష తప్పదని కోర్టు మరోమారు రుజువు చేసినా అక్రమార్కులు తమ చేతులు తడపనిదే పనులు చేయడం లేదు. మద్య నిషేధ, అబ్కారీ శాఖలో కానిస్టేబుళ్లు మొదలు కొని ఉన్నతాధికారుల వరకు నెలసరి మామూళ్లు పుచ్చుకుంటున్నారు. అక్రమార్కులు ఎంతటి వారైనా శిక్ష తప్పదని రుజువు చేస్తున్నా ఉద్యోగుల తీరు మారడం లేదు. ఇకపోతే నాయకులు కూడా అధికారాన్ని అడ్డుపెట్టుకొని అవినీతికి పాల్పడు తున్నారు.

# అజరామరం.. ఆ గానం!

భారతావనిలో ఎందరో గాయకులు ఉద్భవించారు. ఎందరో అవార్డులు, రివార్డులు అందుకున్నారు. కాని సంగీత ప్రియుల హృదయాలలో సుస్థిర స్థానాన్ని పొందిన ఘనత ఘంటసాల మాస్టారుకే దక్కుతుంది. ప్రముఖ గాయకులుగా, తెలుగు సినీ సంగీత దర్శకులుగా, జైలు కెళ్ళిన స్వాతంత్ర్య సమర యోధులుగా ఎనలేని కీర్తినార్జించిన గాన గంధర్వుడు తెలుగువాడు కావడం గర్వకారణం. 1922 డిసెంబర్ 4న గుడివాడ సమీప చౌటపల్లి గ్రామంలో ఘంటసాల సూర్యనారాయణ, రత్నమ్మలకు జన్మించిన వేంకటేశ్వరరావు నామాంకితుడైన ఘంటసాల, బాల్యం నుండే సంగీతం పట్ల మక్కువ కలిగి ఉన్నారు. కచేరీలలో తండ్రి మృదంగం సహకారం అందించడానికి వెళుతూ, కుమారుడిని భుజంపై ఎత్తుకుని పాటలు పాడుకుంటూ తీసుకెళ్ళేవారు. కచేరీలలో నాట్యం చేస్తూ, బాల భరతుడు అనిపించు కున్నారు, తాము గొప్ప సంగీత విద్వాంసుడు కావాలనే తమ 11వ ఏట మరణించిన తండ్రి ఆకాంక్షను సాకారం చేయ దృఢ సంకల్పులై, ఒకసారి ఒక సంగీత కచేరీలో పోటీపడి ఓటమి చెందగా, పట్టుదల మరింత పెరిగి, గురుకులాలలో చేరి, కట్టుబాట్లకు తట్టుకోలేక తిరిగి వచ్చేసారు. కొందరు విద్వాంసుల ఇళ్ళల్లో బట్టలుతికి, వంటచేసి, సంగీతాభ్యాసం చేసి, తర్వాత తమ దగ్గరున్న నలభై రూపాయల విలువైన బంగారు ఉంగరాన్ని కేవలం ఎనిమిది రూపాయలకే విక్ర యించి, ఆంధ్రరాష్ట్రంలోని ఏకైక సంగీత కళాశాల ఉన్న విజయ నగరానికి చేరుకున్నారు. రోజుకో ఇంటిలో భోజనం చేస్తూ, జోలెకట్టి అడుక్కుంటూ, ఎల్లమ్మ గుడిలో తల దాచుకున్న ఘంటసాలను పట్రాయని సీతారామశాస్త్రి యాదృచ్ఛికంగా చూడడం, తన ఇంట ఉచితంగా శిక్షణ నివ్వడానికి శాస్త్రి అంగీకరించడం ఘంటసాల జీవితాన్ని మలుపు తిప్పిన సంఘటన. పేదవాడైన శాస్త్రి, ఘంటసాలకు మధూకర (ఉంఛ వృత్తి) నేర్పించారు.

తర్వాత కళాశాలలో చేరి, 4ఏళ్ళ కోర్సును రెండేళ్లకే పూర్తి చేశారు. కొన్నాళ్ళు విజయ నగరంలో కచేరీలు చేసి స్వగ్రామం చౌటపల్లికి చేరుకుని, ఉత్సవాలలో, వివాహ తదితర సందర్భాలలో గాన కచేరీలు చేసి, పాఠాలు నేర్పారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని, రెండేళ్ళు అలీపూర్ జైల్లో కఠిన కారాగార శిక్ష అనుభవించారు.

తమ వివాహ సందర్భంలో స్వయంగా సంగీత కచేరీ చేశారు. అత్తవారి ఊరిలో సముద్రాల రాఘవాచారిని కలవగా, ఆయన సూచనపై, రెండు మాసాలు కచేరీలు చేసి, సమకూర్చుకున్న డబ్బుతో, అప్పు చేసి మద్రాసుకు చేరుకున్నారు. రాఘవాచారి ద్వారా నాటి సినీ ప్రముఖులైన చిత్తూరు నాగయ్య, బి.ఎన్.రెడ్డిల సమక్షంలో పాటలు పాడి, ప్రశంసాపాత్రు లైనారు. పానగల్ పార్కులో నిద్రిస్తూ సముద్రాల చొరవతో మద్రాసు రేడియో కేంద్రంలో లలిత సంగీత గాయకునిగా అవకాశం పొందారు. కొన్ని గీతాలు రచించి, స్వరకల్పన చేసి, స్టేషన్ ద్వారా పాడారు. తర్వాత కాలంలో భువన విజయం పేరుతో వాటిని గ్రంథస్థం గావించారు.

# బయో ఫ్యూయెల్‌కు ప్రోత్సాహం నిల్...




మండించినపుడు శక్తిని ఉత్పత్తి చేసే పదార్థాన్ని ఇంధనం అంటారు. ఇంధన వాడకం నిత్యకృత్యం. వాహనాలు నడవడానికి, విద్యుత్ ఉత్పత్తి చేయడానికి, వంట చేయడానికి ఇలా ఇంధనం ఎన్నో రకాలుగా ఉపయోగ పడుతున్నది. మనం ప్రతిక్షణం ఎన్నోరకాల ఇంధనాలపై ఆధారపడి జీవిస్తున్నాం. నీరు, పెట్రోల్, డీజిల్, బొగ్గు, విద్యుత్, కట్టెపుల్లలు సహా ఎన్నో రకాల ఘన, ద్రవ, వాయు ఇంధనాలు, యురేనియం, థోరియం వంటి అణు రసాయన ఇంధనాలు నిత్య జీవితంతో పెన వేసుకుని పోయాయి. నిత్య జీవితంలో ఇంధనాలుగా ఉపయోగ పడుతున్నాయి. సంప్రదాయ ఇంధన వనరులైన బొగ్గు, పెట్రోల్, డీజిల్, అణు ఇంధనాలు ప్రకృతిలో పరిమితంగా మాత్రమే లభిస్తాయి. వాటిని ప్రస్తుతం వినియోగిస్తున్నట్లుగా విపరీతంగా వినియోగిస్తే ప్రమాదం తప్పదు. అవసరాలకు మించి వినియోగం చేస్తూ పోతే, భవిష్యత్తు అంధకారమే. అందుకే సంప్రదాయేతర ఇంధన వినియోగం ప్రత్యామ్నాయ మార్గంగా చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.పెట్రోల్ డీజిల్ గ్యాసులకు బదులుగా బయో ఇంధన వనరులను, బయోడీజిల్, బయో గ్యాస్ వంటి ఇంధన వనరులపై ఆధారపడడం వల్ల భవిష్యత్తు తరాలకు మేలు చేసినవారం అవుతాం. కొన్ని లక్షల సంవత్సరాల క్రితం భూమి అంతర్భాగంలో చేరి, భూమి లోపల విపరీతమైన ఉష్ణం, పీడనం కారణంగా మృత జీవజాలం నుండి శిలాజ నూనెలు/బొగ్గు ఏర్పడినవి. శిలాజ నూనెలు లేదా శిలాజ ఘన పదార్థాలను (నేల బొగ్గు వంటివి) తిరిగి సులభంగా పునరుత్పత్తి కావించుటకు సాధ్యం కాదు. అలా తిరిగి శిలాజ ద్రవ్యాలు ఏర్పడాలంటే మళ్లీ కొన్ని లక్షల సంవత్సరాలు పడుతుంది. అంటే శిలాజ ఇంధనాలను వాడే కొలది వాడి నిల్వలు తగ్గుతాయి కాని పెరగవు. 19వ శతాబ్ది నుండి శిలాజ ఇంధన వాడకం ప్రపంచ వ్యాప్తంగా పెరిగి పోయింది. పరిశ్రమల్లో బాయిలర్లలో, థెర్మోపవరు ప్లాంటు బాయిలరులో బొగ్గు వాడకం ఎక్కువ. పెట్రోలు, డీజిల్లను ఇంధనంగా వాడు వాహనాలు విపరీతంగా పెరిగిపోయాయి. అందువలన శిలాజ ఇంధనాల నిల్వలు త్వరగా కరిగి, తరిగి పోతున్నాయి. ఇలాగే శిలాజ ఇంధనాల వాడకం కొనసాగితే కొన్ని వందల సంవత్సరాల తరువాత శిలాజనిల్వలు తరిగి పోతూ, బైకులు, కార్లు, బస్సులు, ట్రక్కులు, విమానాలు, ఓడలు ఏవి కదలవు. మళ్ళి మానవుడు ఎద్దుల బండ్లను, గుర్రపు బళ్ళను, సైకిళ్ళను వాడ వలసి వుంటుంది. కనుక కొంత మేరకు పెట్రోలియం ఇంధనాల వాడకం తగ్గించే నేపథ్యంలో ఈ జీవ ఇంధనాల వైపు ప్రపంచ దృష్టి మళ్ళింది. చెట్లగింజల నుండి తీసిన కొన్ని నూనెలు ఆహార యోగ్యం కాదు. ఉదాహరణకు వేప, కానుగ. జట్రోఫా (అడవి ఆముదం, నేపాళం) వంటి అనేక నూనెలు ఆహార యోగ్యం కాదు. ఈ నూనెలను అల్కహాలసిస్ అనబడు ఎస్టరిఫికేసన్ రసాయన చర్య ద్వారా బయోడీజిల్ గా పరివర్తించి,10% వరకు డీజిల్లో కలిపి డిజిల్ను ఇంధనంగా వాహనాల్లో వాడటం వలన డీజిల్ వాడకాన్ని చాలా వరకు తగ్గించవచ్చు. డీజిల్తో నడిచే వాహనాల్లోని అంతర్గత దహన యంత్రం యొక్క కార్బోరేటరులో తగు మార్పులు చేసిన నేరుగా బయోడిజిల్ను వాడవచ్చును. అలాగే డీజల్తో నడిచే రైలు ఇంజనులలో బయోడిజిల్ను వాడవటం వలన కూడా డీజల్ వాడకాన్ని గణనీయంగా తగ్గించ వచ్చు. పశువుల పేడ, మూత్రాలను ఉపయోగించి బయోగ్యాస్ ఉత్పత్తి కొన్ని దశాబ్దాలుగా ఉత్పత్తి చేస్తున్న విషయం తెలినదే. అలాగే ఏదైన జీవద్రవ్య ఘన ఇంధనాన్ని తక్కువ ఆక్సిజన్ అందేలా/లేదా ఆక్సిజన్ రహిత వాతావరణంలో 450ళీ%జ%వద్ద మండించడం వలన జీవ వాయు ఇంధనం ఏర్పడుతుంది. ఘనజీవ ద్రవ్య పదార్థాలను తాపవిచ్ఛేదన / ఉష్ణవిచ్ఛేదన కావించిన హైడ్రోజన్, కార్బన్ మొనాక్సైడ్, మిథేన్, ఈథేను, ఇథైలిన్ వాయువులు ఏర్పడుతాయి. ఈ వాయువులను కండెన్సరు/ ద్రవీకరణకారి లోద్రవీకరించిన ద్రవ ఇంధనం/బయోడీజిల్ ఏర్పడుతుంది. భారత గత యూపీఏ కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతి వ్యయం తగ్గించడం, వాతావరణ కాలుష్య నివారణకు, విలువైన విదేశీ మారక ద్రవ్యం మదింపుకోసం జీవ ఇంధనాల ఉత్పత్తులపై ప్రధానంగా దృష్టి నిలిపింది. ఇంధన భద్రతే విదేశాంగ విధానాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తున్న ప్రస్తుత కాలంలో శిలాజ ఇంధనాల నిల్వలు రోజురోజుకూ అడుగంటి పోతున్న కారణంగా కాక, భూ ఉష్ణోగ్రత వ్యాకోచానికి దారి తీస్తున్న, బొగ్గుపులుసు వాయువుల విడుదలను అరికట్టడానికి, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను అభివృద్ధి చేయడం అనివార్యంగా మన్మోహన్ సింగ్ ప్రభుత్వం భావించింది. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా జీవ ఇంధనాలు (బయో ఫ్యూయెల్) అన్ని విధాలా లాభసాటిగా గుర్తించారు. శిలాజ ఇంధనం పెట్రోలు స్థానంలో, కర్బనం తక్కువగా ఉండే బయో డీజిల్ ప్రత్యామ్నాయ రవాణా ఇంధనంగా అభివృద్ధి చేసే దిశలో, ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో, బయో ఇంధన ఉత్పత్తులపై దృష్టి నిలిపింది. బయో డీజిల్ విపణి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని భావించి, నిర్ధారించి, చమురు ధరలు పెరిగిపోవడాన్ని దృష్టిలో ఉంచుకొని భారత దేశంలో బయో డీజిల్ అభివృద్ధికి పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించే దిశగా కృషి చేసింది. బయో డీజిల్ అనగా కానుగ (శాస్త్రీయ నామం: పెన్నేటి) గింజలు లేదా పెద్ద నేపాళం (జట్రోటా) గింజలనుండి తీసే నూనె. బయోడీజిల్ రెండు దశాబ్దాల క్రితమే గుర్తించినా, అది కార్యరూపం దాల్చడానికి చాలా సమయం పడుతున్నది. సస్టేనెబుల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆఫ్ రూరల్ ఏరియాస్ (సూత్ర) అనే సంస్థ బెంగళూరులో బయో డీజిల్ తయారీ, వినియోగంపై విస్తృత పరిశోధన జరిపింది. బంజరు భూములు అధికంగాగల భారతావనిలో జీవ ఇంధనాన్ని ఉత్పత్తి చేయడానికి పలు పెద్ద సంస్థలు ప్రయత్నించాయి. కానుగ సాగుకు ఎంతో సాంకేతిక పరిజ్ఞానం అక్కరలేదు. కానుగ చెట్లు నెలకు ఒకటి, రెండు తడులతో మామిడి చెట్లంత పెరుగుతాయి. గృహావరణాల్లో, రోడ్ల కిరువైపులా కానుగ నాటితే ఆహ్లాదకరమైన నీడతోపాటు, వేణ్ణీళ్ళకు చన్నీ ళ్ళ తోడు లాగా ఆదాయం పెరుగుతుంది. ఈ చెట్లు 5 సంవత్సరాలు కాపు ప్రారంభించి, 30 ఏళ్ళ వరకు పంట నిస్తాయి. కానుగ స్వయంగా చీడ పీడల నివారణి అయినందున దానిపై ఎటువంటి చీడ పీడలుండవు. నరేంద్ర మోడీ గత ప్రభుత్వం ఇటీవలి కాలంలో పునరుత్పాదక ఇంధన పథకాలకు విశేష కృషి చేసింది. స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడానికి, అవి అందుబాటు యోగ్యంగా ఉండేలా చూడటానికి ప్రాధాన్యం ఇచ్చింది. దేశంలో సులభతర వాణిజ్య నిర్వహణకు ఎంతో చేయూత అందిస్తున్నది. స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు సదుపాయంగా ఉండేలా, అన్ని మంత్రిత్వ శాఖల్లో ప్రాజెక్ట్ అభివృద్ధి విభాగాలను విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విభాగాలను ఏర్పాటు చేసింది. ఇంధన పేదరికాన్ని అంతం చేసే దిశగా, స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడానికి మార్గ నిర్దేశం చేసింది. స్వచ్ఛందంగా శిలాజ ఇంధన వినియోగం, స్వదేశీ ఇంధనాలపై మరింత ఎక్కువగా ఆధారపడటం, విద్యుత్ సేవలను పెంచడం, తాజాగా ఆవిర్భవిస్తున్న హైడ్రోజన్ వంటి ఇంధనాలవైపు మరలడం, అన్ని ఇంధన వ్యవస్థల్లో డిజిటల్ సృజనాత్మక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం తదితర అంశాలపై ప్రభుత్వ దృష్టి కేంద్రీకృతం చేసింది.

# ఎమ్మెల్యే వర్సెస్ ఎమ్మెల్సీ!

నెల్లూరు, : నెల్లూరు జిల్లా ఉదయగిరి టీడీపీలో అంతర్గత విభేదాలు పీక్ లెవల్‌కు చేరాయి. ఎమ్మెల్యే కాకర్ల సురేష్..మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు ఎన్నికలప్పటి నుంచే ఉప్పు-నిప్పుగా ఉంటున్నారట. తనను బద్నామ్ చేయాలన్నదే బొల్లినేని టార్గెట్ అంటూ ఎమ్మెల్యే రగిలిపోతున్నారు.అవకాశం దొరికితే అడ్డంగా బుక్ చేసి తన ప్రతిష్టను దెబ్బతీసేందుకు కాసుకొని కూర్చున్నారని మండిపడుతున్నారు. గత ఎన్నికల్లో తనకు టికెట్ రాకుండా కుట్ర చేసిన నేతతో కలిసి బొల్లినేని..కొత్త జమ్మిక్కులకు తెరలేపారన్నది ఎమ్మెల్యే అలిగేషన్. అయితే ఇలాంటి వెన్నుపోటు రాజకీయాలకు భయపడేది లేదంటూ గట్టి రియాక్ట్ అవుతున్నారు ఎమ్మెల్యే.కుట్రలు చేస్తున్నదెవరైనా దూల తీరుస్తానంటూ వార్నింగ్‌లు ఇస్తున్నారు. మీ జాతకాలు తీసుకెళ్లి అధిష్టానం దగ్గర పెడతానంటూ హెచ్చరిస్తున్నారు. ఇలా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే పొలిటికల్ ఫైట్ నడుస్తుండగానే..రీసెంట్‌గా ఈ ఎపిసోడ్‌లోకి ఓ లేడీ ఎంట్రీ ఇవ్వడం మరింత హాట్ టాపిక్‌గా మారింది. దీంతో ఇటు ఎమ్మెల్యే..ఇటు మాజీ ఎమ్మెల్యే..మధ్యలో లేడీ అన్నట్లుగా ఆసక్తికరంగా మారింది ఇష్యూ.గత ఎన్నికల్లో బొల్లినేని రామారావు ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడగా.. టికెట్ తెచ్చుకున్న కాకర్ల సురేష్ ఎమ్మెల్యేగా గెలిచారు. అప్పటి నుంచి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, బొల్లినేని రామారావు మధ్య అంతర్గతంగా గ్యాప్ నడుస్తూనే ఉందట. ఏదో ఒక ఘటనతో ఇద్దరి మధ్య అంతర్గత విభేదాలు అప్పు డప్పుడు బయటపడుతూనే ఉన్నాయట.ఇటీవల ఉదయగిరి నియోజకవర్గంలో కోట్ల రూపాయల నిధులతో రోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. ఆ పనులను ఇతర ప్రాంతాలకు చెందిన కాంట్రాక్టర్లకు అప్పగించారు ఎమ్మెల్యే. ఆ కాంట్రాక్టర్లను బొల్లినేని రామారావు వర్గం బెదిరించిందనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే ఇటీవల అభివృద్ధిని అడ్డుకుంటే..తాటతీస్తా..! తొక్కుకుంటూ వెళ్తా..అంటూ.. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కామెంట్స్ చేశారట.బొల్లినేని రామారావును ఉద్దేశించే ఎమ్మెల్యేలా ఇలా మాట్లాడారన్న చర్చ ఉండనే ఉంది. అంతేకాదు గత ఎన్నికల్లో తనకు టికెట్ రాకుండా వ్యతిరేకంగా పనిచేసిన బొబ్బూరు వెంగళరావును..బొల్లినేని దగ్గర చేర్చుకుని కుట్రలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు ఎమ్మెల్యే.అయితే ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే మధ్య విభేదాలు రచ్చకెక్కి చర్చకు దారితీస్తున్న వేళ..ఈ ఎపిసోడ్‌లోకి వెంగమా ంబ అనే మహిళ ఎంట్రీ ఇచ్చింది. ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌పై ఆమె ఆరోపణలు చేసిన వీడియో వైరల్ అయింది. కాకర్ల సురేష్‌ను సాఫ్ట్ వేర్ ఉద్యోగం ఇప్పించుమని అడిగితే..నీకు ఉద్యోగం కంటే రాజకీయా లే బాగా సూట్ అవుతాయని ఆశ కల్పించారని చెప్పింది. ఇప్పుడేమో పాలిటిక్స్ నీకెందుకు హ్యాపీగా వ్యాపారం చేసుకో అంటూ మోసం చేశారని వెంగమాంబ ఆరోపించింది. ఆమె ఆరోపణలను ఎమ్మెల్యే కాకర్ల సురేష్..కొట్టి పారేశారు. కొందరు టీడీపీ నేతలే తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మహిళలను పురమాయించి వీడియోలు చేయించి కుట్ర చేస్తున్నారని ఫైరయ్యారు.

# ‘స్పిరిట్’ నుంచి మరో స్టార్ జౌట్..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘స్పిరిట్’ ఇప్పటికే సినీ ప్రేక్షకుల్లో విపరీతమైన అంచనాలను సృష్టించింది. కల్ట్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న సందీప్ రెడ్డి వంగా ఈ సినిమాను రూపొందిస్తుండగా, ‘యానిమల్’ సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన త్రిప్తి డిమ్రీ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇటీవలే ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమవ్వగా, 2027లో విడుదలయ్యే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే విడుదలైన వాయిస్ టీజర్, ప్రభాస్ ఫస్ట్ లుక్‌కు భారీ స్పందన రావడంతో ఈ ప్రాజెక్ట్‌పై హైప్
మరింత పెరిగింది. టీజర్ విడుదలైనప్పటి నుంచి ‘స్పిరిట్’ సినిమాకు సంబంధించిన ప్రతి చిన్న అప్డేట్ కూడా సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్ అవుతోంది. ఈ క్రమంలో తాజాగా మరో క్రేజీ న్యూస్ చర్చనీయాంశంగా మారింది.
ఈ చిత్రంలో ప్రముఖ సీనియర్ నటుడు ప్రకాష్ రాజ్ కీలక పాత్రలో నటిస్తున్నారని ముందుగా వార్తలు వచ్చాయి. అంతేకాదు వాయిస్ టీజర్‌లో కూడా ఆయన వాయిస్ వినిపించడంతో సినిమాలో ఆయన పాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అభిమానులు భావించారు. అయితే ఇప్పుడు అనూహ్యంగా ‘స్పిరిట్’ ప్రాజెక్ట్ నుంచి ప్రకాష్ రాజ్ తప్పుకున్నారనే వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. ఈ విషయం పై అధికారిక ప్రకటన ఏదీ రాకపోయినా, సోషల్ మీడియా మరియు జాతీయ స్థాయి ఎంటర్‌టైన్‌మెంట్ వేదికల్లో ఈ వార్త విస్తృతంగా ప్రచారం పొందుతోంది.
ఆయన ఎందుకు తప్పుకున్నారనే విషయంపై స్పష్టత లేకపోవడంతో ఆసక్తి మరింత పెరిగింది. గతంలో ఈ సినిమా నుంచి హీరోయిన్ దీపికా పదుకొనే తప్పుకున్నారనే వార్తలు కూడా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ప్రకాష్ రాజ్ గురించిన ప్రచారం బయటకు రావడంతో మళ్లీ అదే తరహాచర్చ మొదలైంది. అయితే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు ఈ వార్తల నిజానిజాలు తెలియవు. భారీ అంచనాలతో రూపొందుతున్న ‘స్పిరిట్’ సినిమాలో నటీనటుల మార్పులు జరుగుతాయా లేదా అన్నది తెలుసుకోవాలంటే అభిమానులు ఇంకొంత కాలం వేచి చూడాల్సిందే.

# సెక్సీ డ్రెస్ లో రమ్మన్నారు...



అందంతో మాత్రమే కాదు, టాలెంట్ తో కూడా ఇండస్ట్రీ లో మంచి అవకాశాలను సంపాదించొచ్చు అని నిరూపించిన హీరోయిన్స్ లో ఒకరు ఐశ్వర్య రాజేష్ ప్రముఖ సీనియర్ హీరో రాజేష్ కుమార్తె గా ఈమె ఇండస్ట్రీ లోకి అడుగుపెట్టింది. లేడీ కమెడియన్ శ్రీలక్ష్మి స్వయంగా ఈమెకు మేనత్త. తమిళం లో ఎక్కువగా సినిమాలు చేస్తూ వచ్చిన ఐశ్వర్య రాజేష్, అక్కడ తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపుని ఏర్పాటు చేసుకుంది. తెలుగు లో ఈమె ‘కౌసల్య కృష్ణమూర్తి’ అనే చిత్రంతో ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత సాయి ధరమ్ తేజ్ హీరో గా నటించిన ‘రిపబ్లిక్’ లో హీరోయిన్ గా చేసింది. నాని ‘టక్ జగదీశ్’ చిత్రం లో ఈమె సెకండ్ హీరోయిన్ గా చేసింది. ఇవన్నీ ఒక ఎత్తు అయితే, టాలీవుడ్ లో ఆమె కెరీర్ ని పూర్తిగా మలుపు తిప్పిన చిత్రం ‘సంక్రాంతికి వస్తున్నాం’.గత ఏడాది సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ సినిమా కమర్షియల్ గా సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ గా నిల్చింది. ఇందులో ఐశ్వర్య రాజేష్ నటనకు కూడా మంచి మార్కులు పడ్డాయి. ఇదంతా పక్కన పెడితే రీసెంట్ గా ఈమె ఇచ్చిన ఒక ఇంటర్వ్యూ లో తన జీవితం లో ఎదురైనా కొన్న సంఘటనల గురించి చెప్పుకొచ్చింది. ఆమె మాట్లాడుతూ ‘నేను కెరీర్ ప్రారంభ దశలో ఒక సినిమా కోసం ఆడిషన్స్ కి వెళ్లాను. ఆ చిత్ర డైరెక్టర్ నన్ను సెక్సీ నైట్ డ్రెస్ లో కనిపించమని అన్నాడు. నేను అందుకు ఒప్పుకోలేదు. ఆడిషన్స్ ఇవ్వకుండానే తిరిగి వచ్చేశాను. నా శరీరం కనిపించాలని అన్నాడు, ఆ సమయం లో నాకు చాలా కోపం వచ్చేసింది. నన్నే కాదు, ఇలా అతను గతం లో ఎంతమంది హీరోయిన్స్ ని అడిగి ఉంటాడో మీరే ఊహించుకోండి. నా సంఘటనని ఎప్పటికీ మర్చిపోలేను’ అంటూ చెప్పుకొచ్చింది ఐశ్వర్య రాజేష్.ఐశ్వర్య రాజేష్ అందరి హీరోయిన్స్ లాగా హాట్ డ్రెస్ లో గ్లామర్ గా కనిపించగలదు, కానీ ఇప్పటి వరకు సినిమాల్లో అలాంటి పాత్రల్లో కనిపించలేదు. సంస్కార పక్షమైన దుస్తుల్లోనే కనిపించింది. ఇలాంటి వాళ్లకు కెరీర్ ఉండదని అందరూ అంటుంటారు. కానీ ఐశ్వర్య రాజేష్ తనకంటూ కొన్ని సిద్ధాంతాలను పెట్టుకొని, ఆ దిశగానే తన కెరీర్ ని సాగిస్తూ ముందుకెళ్తోంది. ఈ కాలం లో ఇండస్ట్రీ లో ఇలాంటి హీరోయిన్స్ దొరకడం చాలా అరుదు అంటూ సోషల్ మీడియా లో నెటిజెన్స్ కామెంట్స్ చేస్తున్నారు.


## క్రేజీ సీక్వెల్ ‘ఆవేశం 2’ వచ్చేస్తుంది..

# పుష్ప యాక్టర్ ఫహద్ ఫాసిల్ ఏం చెప్పాడంటే..?



తెలుగు ప్రేక్షకుల్లో సూపర్ ఫ్యాన్ బేస్ ఉన్న మాలీవుడ్ స్టార్ హీరోల్లో టాప్‌లో ఉంటాడు ఫహద్ ఫాసిల్. ఈ క్రేజీ యాక్టర్ నటించిన మాలీవుడ్ యాక్షన్ కామెడీ డ్రామా ఆవేశం.రోమాంచం ఫేం జీతూ మాధవన్ డైరెక్ట్ చేశాడు. సుమారు రూ.30 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ మూవీ గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచింది. ఈ చిత్రంలో ఫహద్ ఫాసిల్ పోషించిన రంగ పాత్రకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.కాగా ఈ క్రేజీ చిత్రానికి సీక్వెల్ రాబోతుందన్న వార్త ఇప్పుడు మూవీ లవర్స్‌ను ఖుషీ చేస్తోంది. తాజాగా ఓ ఈవెంట్‌లో సీక్వెల్‌పై క్లారిటీ ఇచ్చాడు ఫహద్ ఫాసిల్. ఆవేశం 2 ఉంటుందని అధికారికంగా ప్రకటించాడు. సీక్వెల్ 2027 లేదా 2028లో మొదలు కానుందని కూడా క్లారిటీ ఇచ్చాడు. డైరెక్టర్ జీతూ మాధవన్ సూర్యతో చేస్తున్న తన తొలి తమిళ చిత్రంతో బిజీగా ఉన్నాడు. ఈ మూవీతోపాటు ఫహద్ ఫాసిల్ కమిట్ మెంట్స్ పూర్తయిన తర్వాత ఆవేశం 2 సెట్స్‌పైకి వెళ్లనుందట. మొత్తానికి పుష్ప యాక్టర్ అభిమానులు, మూవీ లవర్స్‌కు ఇది గుడ్ న్యూస్ అనే చెప్పాలి.ఓ వైపు ఫహద్ ఫాసిల్ అండ్ టీం కామిక్ టైమింగ్.. మరో యాక్షన్ ఎలిమెంట్స్‌తో సాగే ఆవేశం చిత్రానికి సీక్వెల్‌గా రాబోతున్న ఆవేశం 2 అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. ఆవేశం చిత్రాన్ని ఫహద్ ఫాసిల్-నజ్రియా నజీమ్, అనన్ర్ రషీద్ సంయుక్తంగా నిర్మించారు.

# టాలీవుడ్‌లో సీక్వెల్స్ ట్రెండ్ జోరు.. పార్ట్ 2, పార్ట్ 3లతో రాబోతున్న భారీ సినిమాలు!



ఒకప్పుడు సినిమా అంటే ఒక పార్ట్‌తో ముగిసిపోయే కథ. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. తెలుగు ప్రేక్షకులు ఎక్కువగా వినని “సీక్వెల్” అనే పదం ఇప్పుడు ఇండస్ట్రీలో అత్యంత వినిపిస్తున్న మాటగా మారింది. ఒక హిట్ సినిమా వస్తే× దానికి రెండో భాగం, మూడో భాగం తీసే ట్రెండ్ వేగంగా పెరుగుతోంది. దర్శకులు, హీరోలు, నిర్మాతలు అందరూ ఇప్పుడు సీక్వెల్స్‌పైనే దృష్టి పెడుతున్నారు. ప్రేక్షకుల్లోనూ అదే ఆసక్తి కనిపిస్తుండటంతో ఇది ఇండస్ట్రీలో ఓ కొత్త ట్రెండ్‌గా మారింది. ఫ్యామిలీ ఎమోషన్‌తో కూడిన క్రైమ్ థ్రిల్లర్‌గా ‘దృశ్యం’ సిరీస్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. వెంకటేష్ నటించిన ‘దృశ్యం’, ‘దృశ్యం 2’ రెండూ సూపర్ హిట్ అయ్యాయి. ఇప్పుడు ‘దృశ్యం 3’ కోసం సిద్ధమవుతున్నారు. మలయాళ వెర్షన్ ఇప్పటికే పూర్తయి విడుదలకు రెడీగా ఉండగా, హిందీ వెర్షన్ షూటింగ్ దశలో ఉంది. రెండో భాగం ముగిసిన దగ్గర నుంచే మూడో భాగం ప్రారంభమవుతుందని సమాచారం.పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఈ ఏడాది రెండు భారీ సీక్వెల్స్‌తో రానున్నాడనే టాక్ గట్టిగా వినిపిస్తోంది. అవే ‘కల్కి 2’, ‘సలార్ 2’. ప్రస్తుతం ‘ఫౌజీ’, ‘స్పిరిట్’ షూటింగ్స్‌లో బిజీగా ఉన్న ప్రభాస్× వాటి తర్వాత ‘కల్కి 2’ను మొదలు పెట్టి, ఆపై ‘సలార్ 2’పై దృష్టి పెట్టనున్నాడని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ప్రశాంత్ నీల్ ఇతర ప్రాజెక్టులు పూర్తి చేసిన తర్వాతే ‘సలార్ 2’ పట్టాలెక్కే అవకాశం ఉంది.ఎన్టీఆర్ – కొరటాల శివ కాంబినేషన్‌లో వచ్చిన ‘దేవర’కు సీక్వెల్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ‘దేవర 2’ స్క్రిప్ట్ పనులు ఇప్పటికే కొనసాగుతున్నాయని, త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లే అవకాశముందని సమాచారం. యంగ్ హీరో తేజ సజ్జ కూడా సీక్వెల్స్ రేసులో ముందంజలో ఉన్నాడు. ‘జాంబిరెడ్డి 2’, ‘జై హనుమాన్’, ‘మిరాయ్ 2’ చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ‘జై హనుమాన్’లో కన్నడ స్టార్ రిషబ్ శెట్టి కీలక పాత్ర పోషించనున్నాడనే వార్త సినిమాపై మరింత హైప్ తీసుకొచ్చింది. చిన్న సినిమాల సీక్వెల్స్ కూడా రేసులో ఉన్నాయి. ‘ఈ నగరానికి ఏమైంది’ సీక్వెల్ ‘జుచీజు రిపీట్’ పేరుతో రాబోతోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నుంచి వచ్చిన‘మ్యాడ్’ సిరీస్ ఇప్పటికే రెండు భాగాలతో విజయం సాధించగా, ఇప్పుడు ‘మ్యాడ్ జూనియర్స్’ రూపొందుతోంది. హారర్ థ్రిల్లర్ ‘పొలిమేర 3’ను పాన్ ఇండియా స్థాయిలో తీసుకురావడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇవి మాత్రమే కాకుండా ‘పుష్ప 3’,‘కార్తికేయ 3’, ‘టిల్లు క్యూబ్’, ‘కేజీఎఫ్ 3’ వంటి ప్రాజెక్టులు కూడా భవిష్యత్తులో రాబోతున్నాయి. వీటిపై అధికారిక ప్రకటనలు ఆలస్యమవుతున్నా ప్రేక్షకుల్లో మాత్రం భారీఆసక్తి ఉంది.మొదటి భాగం విజయా న్ని కొనసాగించడం సీక్వెల్‌లకు పెద్ద సవాలే. కథ, ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్ అన్నీ బ్యాలెన్స్‌గా ఉంటేనే ప్రేక్షకులను ఆకట్టుకోవచ్చు. అయితే ట్రేడ్ వర్గాల అభిప్రాయం ప్రకారం రాబోయే సీక్వెల్స్ కూడా విజయవంతమైతే టాలీవుడ్‌లో ఈ ట్రెండ్ మరింత వేగంగా విస్తరించే అవకాశముంది.

# వాళ్లిద్దరికీ మాత్రం సిస్టర్ గా నటించలేను



సీనియర్ నటి సురేఖావాణి కుమార్తె సుప్రీత హీరోయిన్‌గా వెండితెరకు పరిచయం అవుతున్న విషయం తెలిసిందే. తన తొలి చిత్రం ‘అమరా వతికి ఆహ్వానం’ ప్రమోషన్లలో భాగంగా ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. మంచి కథ వస్తే క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా చేయడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే ఇద్దరు హీరోలకు మాత్రం మాత్రం చెల్లిగా నటించనని పేర్కొంది. ఃఃపవన్ కల్యాణ్, ఎన్టీఆర్ వంటి స్టార్లకు చెల్లిగా నటించే అవకాశం వస్తే తప్పకుండా చేస్తాను. కానీ, విజయ్ దేవరకొండ, అఖిల్ అక్కినేనిలకు మాత్రం సిస్టర్ గా చేయనుఃః అని సుప్రీత స్పష్టం చేసింది. వాళ్లిద్దరూ అంటే తనకు చాలా ఇష్టమని, టెన్త్ క్లాస్ పాసయితే అఖిల్ తో డిన్నర్ కు తీసుకెళ తానని అమ్మ మాటిచ్చిందని సుప్రీత వెల్లడించింది. కానీ ఇంతవరకు అది నెరవేరలేదని విచారం వ్యక్తం చేసింది. హీరోయిన్‌గా మాత్రమే కాకుండా విభిన్న పాత్రలు పోషించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆమె తెలిపింది. సుప్రీత నటిస్తున్న ‘అమరావతికి ఆహ్వానం’ అనే హారర్ చిత్రం ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకు రానుంది.ఇదే ఇంటర్వ్యూలో తన జీవితంలో ఎదుర్కొన్న ఓ భయంకరమైన అనుభవా న్ని కూడా సుప్రీత పంచుకుంది. బరువు పెరిగావంటూ చుట్టూ ఉన్నవారు అనడంతో తీవ్రమైన ఒత్తిడికి గురయ్యానని, దాంతో బరువు తగ్గాలని తప్పుడు డైటింగ్ పద్ధతులు పాటించానని సుప్రీత భావోద్వేగంతో చెప్పింది. ఃఃఒత్తిడి పెరిగినప్పుడల్లా ఇంకా ఎక్కువ తినేదాన్ని. దాంతో లావయ్యాను. వెంటనే బరువు తగ్గాలని నిర్ణయించుకుని, రోజుకు ఒక పూట మాత్రమే తినడం మొదలుపెట్టా. సుమారు 12 నుంచి 15 గంటలు ఏమీ తినకుండా ఉండేదాన్ని.

# తెలుగు నేర్చుకుంటున్న ప్రియాంక చోప్రా..



సూపర్ స్టార్ మహేష్ బాబు– దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో పాన్ ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్ రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ ‘వారణాసి’ టైటిల్ అనౌన్స్‌మెంట్ హైదరాబాద్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగిన గ్లోబ్ ట్రాటర్ ఈవెంట్‌లో గ్రాండ్‌గా జరిగింది. మహేష్ ఫస్ట్‌లుక్, గ్లింప్స్‌తో జక్కన్న ప్రపంచానికి కొత్త రూపాన్ని పరిచయం చేస్తే, బాలీవుడ్ స్టార్ ప్రియాంక చోప్రా ఈవెంట్‌లో సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా నిలిచారు.
స్టేజ్‌పైకి వచ్చిన ప్రియాంక చోప్రా తెలుగులో “హలో హైద రాబాద్”,“తగలబెట్టేద్దామా?” అంటూ అభిమానులను పలకరించడంతోహాల్ అంతా హర్షధ్వనులతో మార్మోగింది. ఈ క్యూట్ తెలుగు డైలాగులు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.
ఈవెంట్ కోసం ప్రత్యేకంగా తెలుగు ప్రాక్టీస్ చేసిన వీడియోను కూడాఆమె షేర్‌చేయగా, ఆ డెడికేషన్‌పై నెటిజన్లు ఫిదా అవుతున్నారు.“సినిమాలో కంటె లైవ్ స్టేజ్‌పై తెలుగు మాట్లాడడం చాలా కష్టం”అంటూ ప్రియాంక చెప్పిన మాటలు అందరిదృష్టిని ఆకర్షించాయి. ఇందు కోసం ప్రత్యేకంగా ఒక డైరీ మెయింటైన్ చేస్తున్నట్లు వెల్లడించారు. ‘వారణాసి’ చిత్రంలో ప్రియాంకనే హీరోయిన్ అని నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ఆమె ‘మందాకిని’ పాత్రలో కనిపించనున్నారు.ఇప్పటికే విడుదలైన ఆమె ఫస్ట్‌లుక్ భారీ హైప్ క్రియేట్ చేస్తుంది. గుహలో దేవతా విగ్రహాల మధ్య చీర కట్టుకుని గన్ పట్టుకుని కనిపించిన మాస్ అవతారం అందరినీ ఆశ్చర్యపరిచింది. టీజర్‌లో ప్రత్యేకంగా చూపించిన చిన మస్తానా దేవి టెంపుల్ సన్నివేశం చర్చనీయాంశమైంది. ప్రమాదంలో చిక్కుకున్న ప్రియాంకను హీరో కాపాడే విజువల్స్ థ్రిల్లింగ్‌గా అనిపించాయి.
చిన మస్తాదేవి తాంత్రిక పూజల్లో ఆరాధించే రౌద్రరూపం. ముఖ్యంగా టిబెటిన్ తాంత్రిక సంప్రదాయాల్లో ఈ దేవికి ప్రత్యేక స్థానం ఉంది.చిన్నమస్తా, ప్రచండ చండిక, జోగని మావంటి పేర్లతో కూడా పిలుస్తారు. టీజర్‌లో ఈ దేవి విగ్రహం చుట్టూ రూపొందిం చిన సన్నివేశాలు సినిమాకు కీలకం కానున్నాయని తెలుస్తోంది.
ఈ పాత్రను రాజమౌళి ఎలా తీర్చిదిద్దారు? ఏ ప్రపంచంలో ఆమె పాత్ర విస్తరించబోతుంది? అనేదానిపై అభిమాను ల్లో భారీ ఆసక్తి నెలకొంది. మహేష్ – రాజమౌళి కాంబినేషన్‌కు తోడు ప్రియాంక చోప్రా శక్తివంతమైన పాత్రలో కనిపించబోతుం డటంతో ‘వారణాసి’పై ఎక్స్‌పెక్టేషన్స్ మరింత పెరిగాయి.

Published & Owned by Mamidi Somaiah, H.No.3-12-92/271 to 276/506, Rock Town Colony, LB Nagar, Hyd, Rangareddy, Telangana 500068. Printed at Ellora Printers, LN Nagar, Industrial Estate, Uppal, Rangareddy, Telangana. Editor Mamidi Somaiah. Ph No. 9100933723. RNI No. TEL TEL : 2012/48343